


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



16

జగిత్యాల

సోమవారం | 28-8-2017

రైతు సంఘాలకు రాజకీయ రంగు

- సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి సంఘాల ఏర్పాటు
- గ్రామాలపై ప్రజాప్రతినిధుల దృష్టి
- జిల్లాలో ఏర్పాటు కానున్న 266 రైతు సంఘాలు
- కసరత్తు ప్రారంభించిన అధికారులు



రైతు సంఘాల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించడంతో జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలనే ఆలోచనతో రైతు సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామస్థాయి నుంచి ఏర్పాటు కానున్న ఈ రైతు సంఘాలకు రాజకీయ రంగు అలుముకుంటోంది. సంఘాల ప్రతినిధులుగా ఎన్నికయ్యేందుకు కొందరు పావులు కదుపుతున్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 9వరకు రైతు సంఘాలను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించడంతో అధికారులు కూడా ఏర్పాట్లు ప్రారంభించారు. జిల్లాలో 266 రెవెన్యూ గ్రామాలు ఉండడంతో ఆదిశగా కసరత్తు చేస్తున్నారు.

◆ ఆంధ్రజ్యోతి, జగిత్యాల 2





అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే

హరితహారం విజయవంతం

- కలెక్టర్ డాక్టర్ ఎ. శరత్
- జియో ట్యాగింగ్‌తో మొక్కల పరిరక్షణ
- వచ్చేనెల 10లోపు లక్ష్యాన్ని పూర్తి చేయాలి
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

16

మెట్‌పల్లి/కోరుట్ల రూరల్



మొక్కలు నాటుతున్న కలెక్టర్

నేడు హరీష్‌రావు పర్యటన

2

- ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

అవినీతి అధికారితో రాజీ పడలేకే

శ్రీకాంత్ ఆత్మహత్య

- మరణవాంగ్మూలం కూడా పట్టించుకోరా?
- ప్రభుత్వ అవినీతికి నిదర్శనం
- 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, భార్యకు ఉద్యోగం ఇవ్వాలి
- సీఎల్పీ ఉప నేత జీవన్‌రెడ్డి

6

- వెల్గటూర్



మహిళలకు అందించనున్న బతుకమ్మ చీరలు



బతుకమ్మ చీరలను పరిశీలిస్తున్న చేనేత, జౌళి శాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్

10

పేద మహిళలకు బతుకమ్మ చీరలు

- 18 సంవత్సరాలు నిండిన మహిళలందరూ అర్హులు
- తెల్లరేషన్ కార్డు అర్హతగా ఎంపిక
- సెప్టెంబరు 18, 19, 20 తేదీల్లో రేషన్ దుకాణాల్లో పంపిణీ
- జిల్లాలో 3లక్షల చీరల పంపిణీకి ఏర్పాట్లు

ఆర్భాటం కోసమే

కాళేశ్వరం రివర్స్ పంపింగ్ పనులు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు సాగర్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్ రావు

జగిత్యాల టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటం కోసమే కాళేశ్వరం రివర్స్ పంపింగ్ పనులను చేపట్టిందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు అయిల్నేని సాగర్ రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. జిల్లాలోని మల్యాల మండలం పోతారం, రాంపూర్ గ్రామాల మధ్య పంప్‌హౌస్ నిర్మాణం కోసం రైతులను బెదిరించి భూసేకరణ చేశారని ఆరోపించారు. ఆర్డీవో స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఎకరాకు రూ.11.50లక్షల పరిహారంతోపాటు క్రాఫ్ డ్యామేజ్ కింద 1.50లక్షలు ఇస్తామని చెప్పిన హామీలు మాటలకే పరిమితమయ్యాయన్నారు. రాత్రికి రాత్రే 32మంది రైతులకు పరిహారం కింద ఎకరాకు 10లక్షల పేరుతో సెప్టెంబరు 20వ తేదీన పోస్ట్‌పెడ్ చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారన్నారు. పరిహారం విషయంలో కలెక్టర్ శరత్ ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ భూమితోపాటు డబుల్ బెడ్ రూం ఇల్లు, అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గొప్పలు చెప్పుకునేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు పనులను చేపడుతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ల మెప్పుకోసం కాదు రైతుల బాగోగుకోసం ప్రభుత్వం పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి భోగ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి రాజన్న, నాయకులు బాలె శంకర్, వొల్లం మల్లేశం, హనుమండ్ల జయశ్రీరఘు, వొల్లాల గంగాధర్, నవ్వోతు రవీందర్, వనమాల నిరంజన్, కొండ శ్రీధర్, గుగ్గిళ్ల సత్యనారాయణ, కిషన్ రెడ్డి, రైతులు గొట్టం గంగాధర్, నారాయణ, నర్సయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘాలకు రాజకీయ రంగు

ఆంధ్రజ్యోతి, జగిత్యాల: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి అక్కడికక్కడే ధర నిర్ణయించడంతో పాటు రైతు సమస్యలకు గ్రామ స్థాయిలోనే పరిష్కారం చూపేందుకు ఏర్పాటు కానున్న రైతు సంఘాలకు రాజకీయ రంగు అంటుకుంటోంది. గ్రామ స్థాయిలో రైతు సంఘాలను ఏర్పాటు చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలను పురమాయించడంతో గ్రామాల్లో మళ్లీ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. దుక్కులు దున్నుకొని పంటలు వేసుకోవడంలో బిజీగా ఉన్న రైతుల చుట్టూ మళ్లీ రాజకీయ ప్రతినిధులు తిరుగుతున్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 9వరకు రైతు సంఘాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో గ్రామస్థాయిలో రైతు సంఘాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

● జిల్లాలో 266 రైతు సంఘాలు

రైతుల భూ సమస్యలు, గిట్టుబాటు ధర, ఇతర సమస్యలకు పరిష్కారం చూపాలనే ఆలోచనతో తెలంగాణ ప్రభుత్వం రైతు సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రెవెన్యూ గ్రామానికి ఒక రైతు సంఘంతోపాటు మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయంతో పాటు వ్యవసాయేతర పనులపై ఆధారపడిన రైతులు దాదాపు 8లక్షల మంది వరకు ఉంటారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడిన వారు 1,55,181 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,45,218 హెక్టార్ల సాగుకు యోగ్యమైన భూమి ఉంది. జిల్లాలో 75 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఇప్పుడు ప్రభుత్వం రైతు సమన్వయ సమితి పేరిట ఒక్కో రెవెన్యూ గ్రామానికి ఒక్కో రైతు సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లాలో 266 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. జగిత్యాల రెవెన్యూ డివిజన్‌లో 183, మెట్‌పల్లి డివిజన్‌లో 83 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒక్కో రెవెన్యూ గ్రామానికి ఒక్కో రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేయనుండడంతో గ్రామాలవారీగా రైతుల వివరాలను సేకరిస్తున్నారు.

● 12 మందితో గ్రామ రైతు సమన్వయ సమితి

ఒక్కో రెవెన్యూ గ్రామంలో ఏర్పాటు చేయనున్న రైతు సమన్వయ సమితిలో 12 మంది గ్రామ రైతులు సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలోనైతే 15 మంది రైతులతో మండల సమన్వయ సమితి, జిల్లాలోనైతే 24 మందితో జిల్లా రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేస్తారు. గ్రామ రైతు సమన్వయ సమితిలో స్థానిక రైతులందరినీ సభ్యులుగా చేర్చి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తారు. జిల్లాలో 266 రెవెన్యూ గ్రామాలకు ఒక్కో గ్రామంలో 12 మందితో కమిటీ ఏర్పాటు కానుంది. దీంతో 3192 మందితో గ్రామ స్థాయిలో రైతు సంఘాలు ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో 18 మండలాలు ఉండగా, మండల రైతు సమన్వయ సమితి 15 మందితో ఏర్పాటు కానుంది. దీనిలో 270 మందితో మండలాల స్థాయిలో రైతు సంఘాలు ఏర్పాటవుతాయి. జిల్లా రైతు సమన్వయ సమితిలో 24 మందిని సభ్యులుగా తీసుకుని, జిల్లా రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేస్తారు. ఈ రైతు సమితీలు రానున్న రోజుల్లో కీలకంగా మారనుండడంతో అధికార పార్టీ నాయకులు అప్పుడే దృష్టి కేంద్రీకరించారు. ఒక్కో నియోజకవర్గంలో మూడు నుంచి నాలుగు మండలాలు ఉండడంతో తమకు అనుకూలంగా ఉన్న వారినే రెవెన్యూ గ్రామాల్లో సభ్యులుగా చేర్చుకునేందుకు పావులు కదుపుతున్నారు. మండల స్థాయి, జిల్లా స్థాయిలో కూడా రాబోవు రోజుల్లో తమకు ఉపయోగపడేవారే రైతు సమన్వయ సమితిలో సభ్యులుగా ఉండేలా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. జిల్లా స్థాయిలో 24 మందితో ఏర్పాటు కానున్న రైతు సమన్వయ సమితి రానున్న రోజుల్లో కీలకంగా మారనుండడంతో తమ ముఖ్య నాయకులు, అనుయాయులను కమిటీలో సభ్యులుగా చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం గ్రామాలవారీగా రైతుల వివరాలను తెప్పించుకుంటున్నారు. జిల్లా జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలతో పాటు వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లోని రెండేసి మండలాలతో ఏర్పడింది. జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి గెలుపొందగా, టీఆర్ఎస్ ఇన్‌చార్జిగా డాక్టర్ సంజయ్ కుమార్ కొనసాగుతున్నారు. ఎమ్మెల్యేలు లేనిచోట ఎమ్మెల్సీలకు బాధ్యతలు అప్పగిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో కరీంనగర్ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావుకు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. జగిత్యాల నియోజకవర్గం పరిధిలోకి జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలు ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో రైతు సమన్వయ కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ధర్మపురి ఎమ్మెల్యేగా ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ వ్యవహరిస్తుండగా, ధర్మపురి నియోజకవర్గం పరిధిలోకి ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్, పెగడపల్లితో పాటు పెద్దపల్లి జిల్లా పరిధిలో ఉండే ధర్మారం మండలం ఉంటుంది. ఆయన తనకు అనుకూలంగా ఉన్నవారి చేత కమిటీలను రూపొందించుకోనున్నారు. కోరుట్ల ఎమ్మెల్యేగా విద్యాసాగర్ రావు కొనసాగుతున్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోకి కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలు ఉన్నాయి. ఆయనకు అనుకూలంగా ఉన్నవారికి కమిటీలో సభ్యులుగా అవకాశం లభించనుంది.

నిబంధనల మేరకు సంఘాల ఏర్పాటు

-భాగ్యలక్ష్మి, డీఏవో, జగిత్యాల



ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు సమన్వయ సమితీలు ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వపరంగా ఇంకా పూర్తి స్థాయి నిబంధనలు రాలేదు. ఒక్కో రెవెన్యూ గ్రామానికి ఒక్కో రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో 266 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అలాగే 18 మండలాల్లో కూడా 18 కమిటీలను ఏర్పాటు చేస్తాం. ఉత్తమ రైతులు, ఆదర్శ రైతులకు ఇందులో అవకాశాలు కల్పిస్తాం. రైతు సమన్వయ సమితీలపై ఆగస్టు 31న హైదరాబాద్‌లో ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

మంత్రి హరీష్‌రావు పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ

నేడు పర్యటించనున్న మంత్రి

పెగడపల్లి: పెగడపల్లి మండల కేంద్రంలో సోమవారం పర్యటించనున్న భారీ నీటిపారు దలశాఖ మంత్రి హరీష్‌రావు పర్యటన ఏర్పాట్లను ఆదివారం జగిత్యాల డీఎస్పీ కరుణాకర్ పరిశీలించారు. మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం, కేడీసీసీబీ భవనం, మార్కెట్ గోదాంను చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, ఎంపీపీ బాల్క సుమన్‌తో సోమవారం ప్రారంభించనున్నారు.మల్యాల సీఐ కృపాకర్, పెగడపల్లి ఎస్సై వెంకట్‌రెడ్డి, విండో ఛైర్మన్ ఓరుగంటి రమణారావు, ఎంపీపీ కాశెట్టి సత్తయ్య, మార్కెట్ ఛైర్మన్ రాజేశ్వర్ రావు, వైస్ ఎంపీపీ కరుణాకర్ రావు, సర్పంచ్ తాటిపాముల రాజు పాల్గొన్నారు.

దళితులకు అందని సంక్షేమ ఫలాలు



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

జగిత్యాల రూరల్: రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన దళితులకు సంక్షేమ ఫలాలు అందడం లేదని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల మండలం ధరూర్, జాబితాపూర్, ధర్మారంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయని, ఎస్సీ నిధులను పూర్తి స్థాయిలో ప్రభుత్వం అందించడం లేదని పేర్కొన్నారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పని చేయాలని, ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వం గ్రామస్థాయిలో గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించడం లేదని, పూర్తిగా తెలంగాణ రాష్ట్ర వైఫల్యమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం కింద మాత్రమే ఇప్పటి వరకు గ్రామాల్లో పనులు జరుగుతు న్నాయన్నారు. ఎంపీపీ మానసనరేష్ గౌడ్, వైస్ ఎంపీపీ మహేష్, సర్పంచులు జలజదామోదర్ రావు, లక్ష్మినర్సయ్య, మల్లేశం, ఉపసర్పంచ్ మారులక్ష్మిగంగారెడ్డి, ఎంపీటీసీలు సువర్ణ,సురేందర్, శ్రీరాముల గంగాధర్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

● శంషాబాద్ విమానాశ్రయం నుంచి గన్నేరువరం వస్తుండగా ఘటన ● మరో ఇద్దరికి తీవ్రగాయాలు

గన్నేరువరం: కొండపాక శివారు మల్లన్న గుట్ట సమీపంలోని రాజీవ్ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గన్నేరువరానికి చెందిన బత్తిని శేఖర్(23) సౌదీలో ఉండి, ఆదివారం స్వగ్రామానికి తిరిగివస్తున్నాడు. శేఖర్‌ను శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆదివారం తెల్లవారుజామున గన్నేరువరానికే చెందిన కూన సంతోష్(27)కారులో తీసుకుని తండ్రి సమ్మయ్య, అన్నయ్య రమేశ్(28)లు బయలుదేరారు. వారితో సంతోష్ స్నేహితుడైన చొక్కారావుపేటకు చెందిన మహంకాళి అనిల్(28) కూడా ఉన్నాడు. అయితే కొండపాక శివారులో చేరుకున్నారు. అక్కడ ఇనుప చువ్వల లోడుతో ఆగి ఉన్న ట్రాయిలర్‌కు కారు ఢీ కొట్టి లారీ కిందకు దూసుకెళ్లింది. లారీని వెనుకనుంచి ఢీకొట్టగా కారు ముందు సీటులో కూర్చున్న అనిల్, వెనుక సీటులో కూర్చున్న రమేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. కారు డ్రైవర్ సంతోష్, శేఖర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఇరుక్కుపోయిన వారిని 108 అంబులెన్స్ సిబ్బంది, కుకునూర్‌పల్లి పోలీసులు, టోల్‌గేట్ సిబ్బంది బయటకు తీశారు. గాయపడిన వారిని సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు.




కారులో మృతదేహాలు , రమేశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మరణంలోనూ వీడని స్నేహం

కారులో వెళ్లిన మాంకాళి అనిల్, బత్తిని రమేశ్, కూన సంతోష్‌లు ప్రాణ స్నేహితులు. మృతిచెందిన బత్తిని రాయమల్లు ఏడాదిన్నర క్రితం కొత్తపల్లికి చెందిన సరితతో వివాహం జరిగింది. మృతుడు బత్తిని రాయమల్లు ఒడ్డెర పని చేసుకుంటూ బండలు జీవనోపాధి పొందుతుండగా సౌదీ నుంచి వచ్చిన తమ్ముడు బత్తిని రాజశేఖర్(23) గన్నేరువరంకు తన స్నేహితులు కూన సంతోష్, మాంకాళి అనిల్‌తో కలిసి కారులో వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది.

మృతుడు మాంకాళి అనిల్ చొక్కారావుపల్లి గ్రామానికి చెందిన మాంకాళి మల్లయ్య, మల్లవ్వ పెద్దకుమారుడు. అనిల్ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. చొక్కారావుపల్లి గ్రామంలో విషాదం నెలకొంది.

ఆరుగురి పేకాట రాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం : కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో ఒక ఇంటిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం జ్యోతినగర్‌లోని ఇంటిపై దాడి చేయగా ఆరుగురు పట్టుబడ్డారు.

ఇందులో కొలాడి బాలకిషన్‌రావు, అయిల్నేని రామారావు, చెన్నమనేని రాంమోహన్, శివప్రసాద్, జువ్వాడి రవీందర్‌రావు, జువ్వాడి వెంకట్‌రావులు ఉన్నారు. పట్టుబడిన ఆరుగురి వద్ద నుంచి 39,660 రూపాయల నగదు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రెండవ ఠాణా పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగిత్యాలలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు



బాస్కెట్ బాల్ అడుతున్న విద్యార్థులు

జగిత్యాల అర్బన్ : జగిత్యాలలో సెప్టెంబర్ 9,10 తేదిల్లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు బాస్కెట్ బాల్ అసోషియేషన్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ బాలబాలికల జట్లను ఆదివారం ఎంపిక నిర్వహించినట్లు బాస్కెట్ బాల్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి బి.ఆనంతరెడ్డి తెలిపారు. ఇందులో మొత్తం 46 మంది బాలురు, 30 మంది బాలికలు పాల్గొనగా, ఇందులోంచి బాలబాలికల విభాగాల్లో 12 మంది , నలుగురు స్టాండ్‌బై కోసం చొప్పున మొత్తం 16 మంది క్రీడాకారులను వేరు వేరుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు, పీడీలు పి.విశ్వప్రసాద్, జి.నిరంజన్, కె.రవికుమార్, జి.శ్రీధర్‌రావు, పి.కృష్ణప్రసాద్, అజయ్, ప్రేమ్, సాగర్, వేణు, సుధాకర్, ప్రశాంత్, సామంత్, సతీష్, సుమిత్ సామ్రాట్, మంగ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో రౌడీ షీటర్ దారుణ హత్య

● ఇంట్లో నరికి చంపిన దుండగులు ● భూవివాదంలో తలదూర్చడమే కారణమా?



మృతుడి భార్య నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ



హత్యకు గురైన బుగ్గల శ్రీనివాస్

గోదావరిఖని: గోదావరిఖని ఉదయ్‌నగర్‌లో ఆదివారం ఉదయం రౌడీషీటర్ అరుకోళ్ల శ్రీనివాస్ అలియాస్ బుగ్గల శ్రీనివాస్(45) దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు ఇంట్లోకి చొరబడి కత్తులతో నరికి చంపారు. అడ్డువచ్చిన అతని భార్య అంజలిపై సైతం దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఆమె చేతికి తీవ్ర గాయమైంది. ఘటనకు సంబంధించి మృతుడి భార్య అంజలి తెలిపిన వివరాలు...

అరుకోళ్ల శ్రీనివాస్ కుటుంబం కొంత కాలంగా ఉదయ్‌నగర్‌లోని సింగరేణి క్వార్టర్‌లో నివాసముంటుంది. ఆదివారం ఉదయం శ్రీనివాస్, అతని భార్య మాట్లాడుకుంటుండగా పాత నేరస్థుడు పెద్ది రవిశంకర్ లోనికి వచ్చి శ్రీనివాస్‌ను పలుకరించాడు. అతడు కనబడకుండా కత్తిపెట్టుకోవడం గమనించిన శ్రీనివాస్ భార్య అంజలి అతన్ని అడ్డుకుంది. దీంతో అతడు మొదట ఆమెపై దాడి చేశాడు. ఆమె భయంతో పరుగులు తీసింది. వెంటనే శ్రీనివాస్‌పై దాడి చేశాడు. బయట ఉన్న మరో ఐదుగురు వ్యక్తులు లోనికి చొరబడి శ్రీనివాస్ తల, మెడను నరికారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఆటోలో పరారయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఉదయ్‌నగర్ ప్రధానరహదారి పక్కనే ఉన్న క్వార్టర్‌లోనే ఈ ఘటన చోటు చేసుకున్నది. అంజలి అరుపులతో జనం పెద్ద ఎత్తున పోగయ్యారు. రామగుండం సీపీ విక్రమ్‌జీత్‌దుగ్గల్, డీసీపీ విజేందర్‌రెడ్డి, ఏసీపీ అపూర్వరావు, వన్‌టౌన్ సీఐ గజ్జి కృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బుగ్గల శ్రీనివాస్ పలు హత్య కేసుల్లో నిందితుడు

మృతుడు బుగ్గల శ్రీనివాస్ గోదావరిఖని ప్రాంతాల్లో జరిగిన పలు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. సంచలనం సృష్టించిన కానిస్టేబుల్ ఎర్రగోళ్ల రమేష్ హత్య కేసులో ప్రధాన నిందితుడు. ఈ కేసులో శ్రీనుకు సహకరించారని పోలీసు అధికారులైన రాజేంద్రప్రసాద్, విద్యాసాగర్‌లపై కూడా సీబీసీఐడీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉంది. ఇదే కాకుండా గంగానగర్‌లో జరిగిన అంతర్గాం సర్పంచ్ చింతల ప్రశాంత్, జీఎం కాలనీలోని జరిగిన పుట్ట శారద హత్య కేసుల్లో కూడా నిందితుడిగా ఉన్నారు. కానిస్టేబుల్ రమేష్ మరణంపై విచారణ జరిపిన పోలీస్ ప్రత్యేక బృందం చింతల ప్రశాంత్, పుట్ట శారద హత్య కేసుల్లో కూడా శ్రీనివాస్ ప్రమేయం ఉన్నట్టు గుర్తించింది. ఆ కేసుల్లో నిందితుడిగా చేర్చారు. అనంతరం అతనిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచారు.

భూ వివాదాల్లో జోక్యమే హత్యకు కారణమా...

బుగ్గల శ్రీనివాస్ ఒక దినపత్రికలో పాత్రికేయుడిగా పని చేస్తున్నాడు. పలువివాదాల సెటిల్‌మెంట్లలో తలదూర్చినట్టు ప్రచారం జరుగుతుంది. మంచిర్యాలకు సంబంధించి ఒక భూవివాదంలో తలదూర్చడం వల్లే హత్యకు దారితీసినట్టు తెలుస్తున్నది. స్థానిక ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి మంచిర్యాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడని, గోదావరిఖనిలో ఒక వ్యక్తి వద్ద డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించే విషయంలో వివాదం చోటు చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ వివాదంలో జోక్యం చేసుకున్న బుగ్గల శ్రీనివాస్ పలుమార్లు చర్చించినట్టు తెలుస్తున్నది. ఈ విషయంలో విభేదించిన ప్రశాంత్‌నగర్‌కు చెందిన వ్యక్తితో పాటు మరికొందరు బుగ్గల శ్రీనివాస్ హత్యకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అతని భార్య అంజలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు పెద్ది రవిశంకర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గంగాధర : గంగాధర మండల కేంద్రంలో శనివారం రాత్రి తాపీ మేస్త్రీ పని చేసే రాజ్‌కుమార్ (45) అనే వ్యక్తి క్రిమిసంహార మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై స్వరూప్ రాజ్ చెప్పారు. కుటుంబ కలహాలు తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూమార్తె ఉన్నారని ఎస్సై వివరించారు.

పచ్చునూర్‌లో పేకాటరాయుళ్ళ అరెస్టు

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్ గ్రామంలో ఆదివారం 9 మందిపేకాటరాయుళ్ళను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పచ్చునూర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 9 మంది పేకాటరాయుళ్ళతో పాటు రూ. 16325 నగదు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుడిలో చొరబడిన ఎలుగుబంటి

సుల్తానాబాద్: మండలంలోని కనుకుల గ్రామపంచాయతీ పరిధిలోని రాములపల్లిలో శ్రీరామాలయంలో శనివారం రాత్రి ఎలుగుబంటి రావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. గణపతి నవరాత్రులు కావడంతో భక్తులు పూజలు చేస్తుండగా సమీపంలోని గుట్టల నుంచి బల్లూకం గ్రామంలోకి వచ్చి ఆలయంలోని నవగ్రహాల మందిరంలోకి చొరబడింది. యువకులు ధైర్యం చేసి తలుపులు వేసి గడియ పెట్టారు. గ్రామస్థులు పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రాజు, అటవీశాఖ అధికారులు వచ్చి ఎలుగుబంటిని పట్టుకోవడంతో గ్రామస్థులు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



చెట్టును ఢీకొన్న కారు

వేములవాడ టౌన్ : రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన వేములవాడ మండలం ఫాజుల్‌నగర్‌లో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైద్రాబాద్‌కు చెందిన ఓ కుటుంబం దైవదర్శనానికి ధర్మపురికి వెళ్లి శ్రీ లక్ష్మినృసింహాస్వామి వారిని దర్శించుకుని తిరిగి వేములవాడకు శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తూ ఫాజుల్‌నగర్ గ్రామంలో మూలమలుపు వద్ద ప్రమాదశాత్తు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో భాగ్యలక్ష్మి, వెంకట్, సురేఖలకు వెన్నుముకకు గాయాలు కాగా హన్మాండ్లకు కాలు విరిగి త్రీగాయాలైనట్లు తెలిపారు. స్థానికులు వెంటనే 108కి సమచారం అందించడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీ కొని యువకుడి మృతి

శంకరపట్నం: కేశవపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎరడపల్లి గ్రామ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఇదే గ్రామానికి చెందిన దూడం రాజమౌళి (35) అనే యువకుడు ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో రాజమౌళి రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. రాజమౌళిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆటోలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ ఎల్ శ్రీను తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, గుర్తు తెలియని ట్రాక్టర్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లగొండలో వ్యక్తి ఆత్మహత్య

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన కూన కొమురయ్య(49) ఆదివారం సాయంత్రం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య తెలిపారు. వ్యవసాయ పొలం వద్దకు వెల్లి విషం తాగి మృతి చెందటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. మృతునికి భార్య భాగ్యలక్ష్మీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన స్థలం వద్ద విషం డబ్బ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కారణాలు తెలియరాలేదు.

ఎల్లంపెల్లి ప్రాజెక్టులో నియోజకవర్గం వాటా తేల్చాలి

వెల్గటూర్: ఎల్లంపెల్లి ప్రాజెక్టులో ధర్మపురి నియోజకవర్గం వాటా ఎంతో తేల్చాలని బీజేపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నం అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎల్లంపెల్లి ప్రాజెక్టులో నియోజకవర్గ వాటా తేల్చకుంటే ప్రాజెక్టును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు సంకోజు తిరుమల్ చారి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మారం జలంధర్ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఈర్తి మధుకర్, జిల్లా నాయకుడు కొమ్ము రాంబాబు, నాయకులు తాడ్వాయి శ్రీనివాస్ రెడ్డి, అమ్ముల నరేష్, గుంత సంతోష్, గంగాధర్, మంచాల ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి పర్యటన విజయవంతం చేయాలి'

- నేడు రెండు గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలు ప్రారంభం

ధర్మపురి: ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్, రాయపట్నం, ధర్మపురిలో ఈ నెల 28 న సోమవారం జరిగే రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు పర్యటన విజయవంతం చేయాలని ధర్మపురి జడ్పీటీసీ బాదినేని రాజమణి-రాజేందర్, దేవస్థానం చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి కోరారు. స్థానిక హరతి హోటల్‌లో ఆదివారం మధ్యాహ్నం టీఆర్ఎస్ నేతలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ అయ్యోరు రాజేష్‌కుమార్, టీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పులిశెట్టి మల్లేశం, స్తంభంకాడి మహేష్, మహిళా అధ్యక్షురాలు బారతపు మంజుల, ఉపసర్పంచ్ ఇందారపు రామయ్య, జైనా పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేష్, సంగి శేఖర్, బారతపు గుండయ్య, పాదం కొము రయ్య, వసంత్, గడ్డం బాలరాజు పాల్గొన్నారు.

పెగడపల్లి : పెగడపల్లి మండలంలో సోమవారం భారీ నీటిపారుదల శాఖమంత్రి తన్నీరు హరీష్‌రావు పర్యటించనున్నట్లు మండల టీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సంఘ భవనం, కెడిసిసిబి భవనాలు, వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన 2500 మెట్రిక్‌టన్నుల గోదాం, తెలంగాణతల్లి విగ్రహాల ప్రారంభోత్సవాలతో పాటు సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో బహిరంగ సభలలో పాల్గొనేందుకు చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, పెద్దపెల్లి ఎంపీ బాల్క సుమన్, టెస్కా చైర్మన్ కొండూరి రవీందర్ రావులతో కలిసి మంత్రి హరీష్‌రావు పర్యటించి ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ మేరకు రెండు రోజులుగా పెగడపల్లి విండో చైర్మన్ ఓరుగంటి రమణారావు, ఎంపీపీ కాశెట్టి సత్తయ్య, టీఆర్ఎస్ నాయకులు గజ్జెల స్వామి, మాదారపు కరుణాకర్ రావు, తాటిపాముల రాజు, లోక మల్లారెడ్డి, అమిరిశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు ప్రారం భోత్సవాలు, బహిరంగ సభ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ నేతల


మంత్రి ప్రారంభించనున్న మార్కెట్ గోదాం

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

మల్యాల: ఇటీవల స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంచు ఉత్తమ ఉద్యోగులుగా పురస్కారిఆలు అందుకున్న మల్యాలకు చెందిన కరీంనగర్ కలెక్టరేట్ పరిపాలనాధికారి డిండిగాల రవీందర్, ఎస్సై నీలం రవిలను మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల సంఘం అధ్యక్షుడు నేళ్ళ రాజేశ్వర్‌రెడ్డి, మున్నూరు కాపు సంఘం నాయకులు గడ్డం సజన్, జనగాం శ్రీనివాస్, మరాఠి లక్ష్మీనారాయణ, జనగాం వెంకటేశం, ముదాం వేణు, రౌతు రవి, వెలుగొండ గంగాదర్, పందిరి శేఖర్, జనగాం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపం వద్ద అన్నదానం

-కొడిమ్యాలలో మట్టిగణపతికి పూజలు

కొడిమ్యాల : మండలంలోని వివిద గ్రామాల్లో శుక్రవారం ప్రతిష్ఠించిన వినాయకుల వద్ద భక్తులు పూజలు చేస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఉదయం సాయంత్రం వినాయకునికి పూజలు చేస్తు రాత్రివేలల్లో భజనలు చేస్తున్నారు. మండలంలోని తిర్మాలాపూర్ గణపతివద్ద గ్రామస్తులు అన్నదానం నిర్వహించారు. హిమ్మతురావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన గణపతి పాము పడగతో పలువురిని ఆకట్టుకుంటుంది. ఈ కార్యక్రమాల్లో నిర్వహకులు, గ్రామంలో ఎంపీటీసీ మల్లేశంయాదవ్, మాజీ సర్పంచ్ హరెందర్ పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సింగపూర్‌లో ఘనంగా వినాయక చవితి

కొడిమ్యాల: సింగపూర్‌లో శనివారం తెలంగాణ జిల్లాలోని వివిద ప్రాంతాలకు చెందిన వారు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నట్లు కొడిమ్యాల గ్రామానికి చెందిన బైరి రవీందర్ తెలిపారు. వినాయకునికి నైవేద్యం సమర్పించి భక్తి శ్రద్ధతో మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ వాసులు అంకిటి తిరుపతి, పెద్ది శేఖర్‌రెడ్డి, మహేష్,ఉపెందర్, కిరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ

వెల్గటూర్: సీపీఎస్ విధానాన్ని నిరసిస్తూ సెప్టెంబర్ 1న తలపెట్టిన సామూహక సెలవు గోడ పత్రిను వెల్గటూర్‌లో సీపీఎస్ ఉద్యోగులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని ఎత్తివేసి పాత పెన్షన్ పద్దతిని ప్రవేశ పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పెట్టి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ఈఏ మండల అధ్యక్షుడు జోగం శ్రీనివాస్, ఆంజనేయులు, మహేష్ గౌడ్, లక్ష్మినారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణ

గొల్లపల్లి : రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ రికార్డుల శుద్దికరణ కార్యక్రమం గొల్లపల్లి మండలంలో ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం పలు గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల శుద్దికరణ కార్యక్రమంను రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ రైతుల వద్ద వివరాలు సేకరిస్తూ నమోదు చేశారు. మండలంలోని వెన్గుమట్ల, రాఘవపట్నం, దట్నూర్, చెందోళి, మల్లన్నపేట, తిర్మలాపూర్, బొంకూర్, లొత్తునూర్, అగ్గిమల్ల, గుంజపడుగు, అబ్బాపూర్, తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల వీఆర్‌వోలు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ సరిచేశారు. ఈ సందర్భంగా పట్టాదార్ పాసుపుస్తకాలు, ఆన్‌లైన్ పహాణీ, భూముల విస్తీర్ణం, సర్వే నెంబర్ల, 1బీ, 13బీ వంటి భూసంబంధిత అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ రైతుల వద్ద వివరాలు అడిగి సరి చేశారు. రెవెన్యూ రికార్డుల శుద్దికరణ కార్యక్రమాన్ని వేగవంతం చేసి సెప్టెంబర్ 5లోపు వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయనున్నట్లు తహసీల్దార్ సుమచౌదరి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ సురిగినేని కమలాకర్ రావు, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.


రెవెన్యూ రికార్డులను సరిచేస్తున్న సిబ్బంది

పేకాటరాయుళ్ల అరెస్ట్

వెల్గటూర్: మండలంలోని రాజక్కపెల్లిలో పేకాట ఆడుతూ పట్టుబడ్డ ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్ రావు తెలిపారు. రాజక్కపెల్లిలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పట్టుబడ్డ ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు. వారి వద్ద లభించిన ఆరు సెల్ ఫోన్లు, 6150 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బొజ్జ గణపయ్యకు 108 రకాల నైవేద్యం

మల్యాల : గణేష్ నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని మల్యాలలోని శ్రీవాగ్దేవి విద్యాలయాల ఆధ్వర్యంలో ఆదివారం గణనాథునికి 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా కరస్పాడెంట్ పోకల నరేష్ విధ్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్యాల, ముత్యంపేటగ్రామాల్లో వినాయకుల వద్ద అన్నదానాలను చేశారు.

నియామకం

వెల్గటూర్: భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా కప్పారావుపేట గ్రామానికి చెందిన మంచాల ఓదెలు నియామకమైనట్లు మండలశాఖ అధ్యక్షుడు తిరుమల్ చారి తెలిపారు. ఈ మేరకు ఆళీసనకు ఉత్తర్వులు జారీ చేశారు.

హరిత మిత్ర అవార్డు గ్రహీతకు సన్మానం

కొడిమ్యాల : మండలంలోని తిర్మాలాపూర్ సింగిల్ విండో చైర్మెన్ హిమ్మతురావుపేట గ్రామానికి చెందిన పునుగోటి కృష్ణారావు హరితమిత్ర అవార్డ్‌ను అందుకోగా ఆయనను ఆదివారం కొడిమ్యాలలో కొడిమ్యాల మండల ప్రైవేట్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి పూల మాలలతో సన్మానం చేసారు. అనంతరం జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత కృష్ణారావు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో తాను అభివృద్ధి పనులను చేసానన్నారు. హరిత మిత్ర అవార్డు రావటం ఎప్పటికి మరు వలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రైవేటు వైద్యుల సంఘం అధ్యక్షుడు పులి వెంకటేష్, వైద్యుల సంఘం నాయకులు చెన్నూరి గంగాధర్, ఆనందం, సత్యనారాయణ, ఎల్లయ్య, నర్సింహరెడ్డి, సుదర్శన్, లింగంమూర్తి , శంకర్, చంద్రమౌళి, హన్మండ్లు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కొడిమ్యాల : కొడిమ్యాల గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ఆదివారం 14 ఫైనాన్స్‌నుండి విడుదలైన ఐదు లక్షల రూపాయలతో నిర్మించె సీసీ రోడ్ పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నసీరొద్దీన్ పంచాయతీ సభ్యులు బూస గణేష్, రాచకొండ చంద్రమోహన్, నాయకులు, నర్సింహరెడ్డి, గడ్డం సంజీవరెడ్డి, పులి వెంకటేష్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం విజయవంతం చేయాలి

ధర్మపురి: ఆచార్య జయశంకర్, ప్రముఖ కవి కాళోజి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే కవి సమ్మేళనం విజయవంతం చేయాలని తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య ధర్మపురి నియోజకవర్గ కన్వీనర్ కొంక సుధీర్‌కుమార్ కోరారు. ధర్మపురి మండల కేంద్రంలో తెలంగాణ జాగృతి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి నియోజకవర్గ ఇంఛార్జ్ సిరంగి సంతోష్, ధర్మపురి మండల కన్వీనర్ మ్యాన పవన్‌కుమార్, యూత్ కన్వీనర్ కాశెట్టి విజయ్, మహిళా భాధ్యులు జక్కు పద్మ, రాపర్తి విజయలక్ష్మి, మండల, పట్టణ భాధ్యులు కటుకం మహేష్, సురేష్, నవీన్, సంతోష్, సాయితరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజేందర్

వెల్గటూర్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన గంట్యాల రాజేంధర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనకు జిల్లా అధ్యక్షుడు గాజుల నాగరాజు నియామక పత్రాన్ని అందజేశారు. సంఘం అభివృద్దికి కృషి చేస్తానని రాజేంధర్ అన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, గంగాధర్, జిల్లా నాయకులు భార్గవరాం, బుసర్తి గంగారాంలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు దొరిశెట్టి వెంకటయ్య, వెంకటేష్, మద్ది మురళీధర్, శంకరయ్య, ఇంద్రకుమార్, గిరిధర్, దేవరావు, హన్మండ్లు, శ్రీనివాస్, గంగారాం, భరత్, పరందాములు, వెంకటేశం, డాక్టర్ రామస్వామి, శ్రీనివాస్, రమణయ్యలు అభినందించారు.

ఉగ్ర నారసింహుడికి ప్రత్యేక పూజలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఉగ్ర నారసింహుని ఆలయంలో ఆదివారం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారల జన్మ నక్షత్రం అయిన స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు నంబి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు నంబి నరసింహమూర్తి అందంగా పూలతో అలంకరణ చేసిన స్వామి వారలకు శాస్త్రోక్తంగా అభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి, తీర్థ, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్య క్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు నంబి నరసింహమూర్తి, అర్చకులు, నేరెళ్ల వంశీకృష్ణ, నంబి అరుణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం కోసం రూ 5 లక్షలు విరాళాలు

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదానం కోసం మంథని వాస్తవ్యులు శ్రీరాంభట్ల రాధాకృష్ణ, మాధవీలత దంపతులు ఆదివారం రూ 5 లక్షల విరాళాలు అందించారు. ఉదయం వేళలో స్వామి వారలను దర్శనం చేసుకున్న అనంతరం రూ 5 లక్షల చెక్కును దంపతులు దేవస్థానం చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డికి అందించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ దంపతులను ఘనంగా ఆశీర్వదించారు. స్వామి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు బహుకరించారు. ధర్మకర్త మామిడి లింగన్న, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


అన్నదానం కోసం విరాళాలు అందిస్తున్న మంథనికి చెందిన రాధాకృష్ణ-మాధవీలత దంపతులు

వినాయకునికి దద్ధ్యాభిషేకం



వినాయకుని దద్ధ్యాభిషేకంలో ఆర్యవైశ్యులు

మెట్‌పల్లి: పట్టణంలోని వాసవి మాత దేవాలయంలో ఆదివారం వినాయకునికి దద్ధ్యాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా పురోహితులు మారుతీ శర్మ వేదమంత్రోర్చణల మధ్య ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో గల వెండి గణపతి విగ్రహానికి దద్ధ్యాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం స్వర్ణ పుష్పాభిషేకం చేశారు. పలువురు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దొంతుల రాజ్‌కుమార్, నాయకులు కోట కిరణ్‌కుమార్, బండారి గోపి, బండారి ప్రసాద్, పడిగెల శ్రీనివాస్, కోట సుమన్, చొక్కయ్య, తోట పెంటయ్య, మహజాన్ నర్సింలు, గుండ గణేశ్, మహజాన్ శివకుమార్, ఎనగందుల అజయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్ తొలగింపునకు పంచాయతీ పాలకవర్గం తీర్మానం..?

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బిల్ కలెక్టర్‌ను తొలగించడానికై గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు సమాచారం. గ్రామంలో గత కొన్ని రోజులుగా ఐఎస్ఎల్ బిల్లుల చెల్లింపులు, పెన్షన్ల పంపిణీ వాటిలో బిల్ కలెక్టర్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుసుకున్న గ్రామ సర్పంచ్ నోముల భారతీ సమక్షంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం సదరు బిల్ కలెక్టర్‌ను తొలగించడానికి ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిసింది. సంఘటన మండలంలో చర్చానీయాంశమైంది.

110 మందికి స్త్రీనిధి రుణాలు మంజూరు

మల్లాపూర్: ఐకేపీ ఆధ్వర్యంలో స్త్రీ నిధి రుణాలు 110 మందికి మంజూరైనట్లు ఆదివారం ఏపీఎం దేవరాజం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 1.03 కోట్లు విలువ గల రుణాలు మంజూరైనట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం సంబంధిత రుణాలను స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్ రాజు ఆధ్వర్యంలో మంజూరైనట్లు పేర్కొన్నారు. సంబంధిత లబ్దిదారులు త్వరలోనే కేటాయించిన యూనిట్లను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు కామర్స్‌లో అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర నిర్వాహకులు ఒజ్జెల రమేశ్ కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మెట్‌పల్లి పరిసర ప్రాంత విద్యార్థులకు కామర్స్ విభాగంలో ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. కోర్సులో చేరగోరే విద్యార్థులు స్థానిక హిమగిరి మెడికల్ ఏజెన్సీలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9441758916లో సంప్రదించాలని కోరారు.

పరవళ్లు తొక్కింది. గోదారి... పరవశించి పోయాడు అన్నదాత...!!

ఇబ్రహీంపట్నం: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో గోదావరి పరవళ్లు తొక్కుతోంది. గత కొన్ని రోజులుగా నీరు లేక వెళవెళబోయిన గోదావరి నది ఒక్కసారిగా నీటి సామర్థ్యం పెరిగి పొంగిపొర్లుతోంది. ఎగువ నుంచి నీరు భారీ స్థాయిలో వరద ద్వారా గోదావరి నదిలోకి వచ్చింది. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



ఎర్దండిలో గోదావరి ప్రవాహం

మదర్‌థెరిసాను ఆదర్శంగా తీసుకోవాలి

● మెట్‌పల్లిలో ఘనంగా మథర్‌థెరిసా జయంతి వేడుకలు

మెట్‌పల్లి: మదర్‌థెరిసాను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని మెట్‌పల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాంపల్లి శ్రీనివాస్, వాసాల వెంకటేశ్వర్లులు అన్నారు. ఆదివారం పట్టణంలో మథర్ థెరిసా 107వ జయంతి వేడుకలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి మిఠాయి పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. సేవా కార్య క్రమాల్లో మథర్‌థెరిసా ఉత్సాహంగా పనిచేశారని గుర్తు చేశారు. ఆమె సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల ప్రజలు మథర్ థెరిసాను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి లయన్స్ క్లబ్ కోశాధికారి పోలీస్ శ్రీనివాస్, నాయకులు బృగు మహర్శి, వెంకట స్వామి, ఆల్ రౌండర్ గంగాధర్, మృత్యుంజయ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన కలెక్టర్

మెట్‌పల్లి: మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామ శివారు పలు వ్యవసాయ క్షేత్రాలను ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ పరిశీలించారు. మెట్లచిట్టాపూర్ గ్రామ రైతు రాదారపు భూమేశ్వర్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి స్థానిక పరిస్థితులు, సాగు పద్దతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు భూమేశ్వర్ తన ఏడు ఎకరాల స్థలంలో చేపడుతున్న వ్యవసాయాన్ని కలెక్టర్ శరత్‌కు వివరిం చారు. అయిదు ఎకరాల్లో వరి పంట వేసి ఎరువులు, రసాయనాలు వినియో గించుకుండా జీవామృతంతో పండిస్తున్నట్లు తెలిపారు. తన భూమిలో రూ. 1.72 లక్షలతో ఫాంపౌండ్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. దీంతో నీటి కొరత తీరింద ని వివరించారు. మిగిలిన రెండు ఎకరాల్లో మొక్కజొన్న, కంది తదితర ఆరుతడి పంటలను సాగు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్బంగా రైతు భూమేశ్వర్‌ను జిల్లా కలెక్టర్ శరత్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి రాజేందర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ అరుణ శ్రీ, ఏపీడీ సుందర వరదరాజన్, మెట్‌పల్లి ఎంపీడీఓ వెంకటేశ్ జాదవ్, ఇంచార్జీ తహసీల్దార్ సత్యనారాయణ, నాయకులు మారు సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటిస్తున్న కలెక్టర్ శరత్

రైతులకు సన్మానం

మల్లాపూర్: భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్మారం గ్రామంలో గల చౌరస్తా వద్ద ఆదివారం బలరాముని జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా రైతులను ఘనంగా సన్మానించారు. బలరాముని చిత్రపటానికి పూల మాలలు వేసి అలంకరించారు. అనంతరం స్థానిక ఆదర్శ రైతులను గుర్తించి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రాజు, సుభాష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రామానుజం, తిరుపతి, రాజారెడ్డి, ఉప సర్పంచ్ రంజీత్, భారతీయ కిసాన్ సంఘ్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కన్నుల పండువగా సామూహిక దుర్వార్చన



సామూహిక దుర్వార్చనలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సామూహిక దుర్వార్చన కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భగా వినాయకునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా గణపతినికి అభిషేకం, నవగ్రహ ఆరాదన జరిపారు. సామూహిక దుర్వార్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి'



మాట్లాడుతున్న సీఐ సురేందర్

ఇబ్రహీంపట్నం: ప్రతీ ఒక్కరూ పండు గలను శాంతియు తంగా జరుపుకోవాలని మెట్‌పల్లి సీఐ సురేందర్ సూచించారు. ఆదివారం పట్టణంలోని ధర్మోర స్వామి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వినాయక నవరాత్రోత్సవాలు, బక్రీద్ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఎలాంటి అల్లర్లకు పాల్పడవద్దని సూచించారు. ఒకరి పండుగలను మరొకరు గౌరవించుకోవాలన్నారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామ్ నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా వినాయక మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: వినాయక మండప నిర్వాహకులు భక్తి, శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని మెట్‌పల్లి హమ్‌హై ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హైకోర్టు న్యాయవాది సోమ విద్యాసాగర్, అధ్యక్షుడు దొమ్మది నరేందర్‌లు కోరారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో గల వినాయక మండపాలను వారు సం దర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, నవీన్, పాల్గొన్నారు.

గీత పఠనంతో బహుళ ప్రయోజనాలు

● దేవనాథ రామానుజ జీయర్ స్వామి

మెట్‌పల్లి: భగవద్గీత పఠనంతో బహుళ ప్రయోజనాలు అందుతాయని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఖాధీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ ఆవరణలో గల హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతా సత్సంగ్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ భగవద్గీతను పఠించాలని సూచించారు. తద్వారా మానసిక ప్రశాంతత వికసిస్తుందన్నారు. మానవులు చేసే పుణ్యం వల్ల సుఖం, పాపాల వల్ల దుఃఖాలు లభిస్తాయని తెలిపారు. రామానుజ సహస్రాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇంటింటికి ఆహ్వానం పేరుతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు. కులాలు, వర్ణాలు, వర్గాల వివక్షలతో విచ్ఛిన్న మైన సమాజాన్ని సమతా సూత్రంతో ఒక్కటిగా కూర్చిన ప్రేమమూర్తికి 1000 సంవత్సరాలములు నిండే శుభ తరుణానికి సూచికగా ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి గీతా సత్సంగ్ అధ్యక్షుడు చీలమంతుల ఛత్రపతి, నాయకులు మర్రి భాస్కర్, పడిగెల వెంకటేశ్, గాదె రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవనాథ జీయర్ స్వామి

అధికారుల వేధింపులతోనే ఆత్మహత్యలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు సాగర్‌రావు

జగిత్యాల టౌన్: అధికారుల వేధింపులతోనే కింది స్థాయి ఉద్యోగులు మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని టీడీపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు అన్నారు. ఆదివారం టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వెల్గటూర్ మండలం ఎండపెల్లి గ్రామానికి చెందిన పంచాయతీరాజ్ ఉద్యోగి దేవి శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. శ్రీకాంత్ ఆత్మహత్యకు కారకుడైన ఈఈ రాఘవరెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి ఆ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్వసమాజం సిగ్గుపడేలా అధికారులు వేధింపులు మానుకోవాలని, విద్యావంతులైన, మేధావులైన ఉద్యోగులు సమస్యలపై పోరాడాలని ఆత్మహత్య చేసుకోవడం మానుకోవాలని కోరారు. ఉన్నతాధికారులు ప్రతి కార్యాలయంపై ప్రత్యేక దృష్టి సారించాలని మనో వేదనకు గురవుతున్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. ఉన్నత స్థితిలో ఉన్న అధికారులే మామూళ్లకు అలవాటు పడటంతో నిరుద్యోగులు సైతం ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి రాజన్న, నాయకులు బాలె శంకర్, వొల్లం మల్లేశం, హనుమండ్ల జయశ్రీరఘు, వొల్లాల గంగాధర్, నవ్వోతు రవీందర్, వనమాల నిరంజన్, కొండ శ్రీధర్, గుగ్గిళ్ల సత్యనారాయణ, కిషన్‌రెడ్డి, గొట్టం గంగాధర్, నారాయణ, నర్సయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్‌రావు

రేపటి నుంచి మండలస్థాయి క్రీడలు

రాయికల్: ఈనెల 29, 30, 31తేదీల్లో భూపతిపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్)క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్యాంసుందరాచారి తెలిపారు. 29న 14సంవత్సరాలు,7సంవత్సరాలులోపు బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, 30న బాలబాలికలకు అథ్లెటిక్స్, 31న 14సంవత్సరాలు, 17సంవత్సరాలలోపు బాలురకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఉంటాయని వివరించారు.

వోపా ప్రతిభా పురస్కారాలు ప్రదానం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

జగిత్యాల టౌన్: విశ్వబ్రాహ్మణ అఫీసియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జగిత్యాల నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి పరీక్షలో ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దురిశెటి వెంకటేశ్వరచారి, ద్రోణచారి, విష్ణువర్ధన్, పరమేశ్వర్, ఆనంద్, కృష్ణదాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో చోరీ

జగిత్యాల టౌన్: పట్టణంలోని మున్సిపల్ పార్క్ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లో దొంగలు షట్టర్‌లను గునపాలతో లేపి చోరీకి యత్నించారు. శ్రీ సాయి ట్రావెల్స్, సాయిరామకృష్ణ ట్రావెల్స్‌లో రూ.10 వేలు ఎత్తుకెళ్లారు. ఇదే షాపింగ్ కాంప్లెక్స్‌లో మరికొన్ని దుకాణాల్లో దొంగలు చోరీకి యత్నించినా షట్టర్‌లు తెరుచుకోలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

శాకాంబరి అవతారంలో వినాయకుడు

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులో జానకీ రామ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుడు ఆదివారం భక్తులకు శాకాంబరి అవతారంలో దర్శనమిచ్చాడు.

ఈ సంద ర్భంగా భక్తులు వినాయక మండపం వద్ద కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జానకీ రామ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

● టీఆర్ఎస్ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్ కుమార్

జగిత్యాల టౌన్: రైతుల బాగు కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మిస్తున్న ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే కొంత మంది కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను మానుకోవాలని టీఆర్ఎస్ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం భూసేకరణ చేసి తక్షణ పరిహారం అందజేస్తే దానిని కాంగ్రెస్ నాయకులు భూసేకరణ చట్టం పేరుతో లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు రైతులే స్వచ్ఛందంగా తరలివస్తూ కాళేశ్వరం ప్రాజెక్టుకు మద్దతు తెలుపుతుంటే కొంత మంది టీఆర్ఎస్ బల నిరూపణ ప్రదర్శిస్తోందని అనడం అవివేకమన్నారు. కాంగ్రెస్ హయాంలో భూ సేకరణ చేసినప్పుడు ఒక్క రైతుకు కూడా సరియైన పునరావాసం కల్పించలేదని కాని టీఆర్ఎస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతోందన్నారు. ఈ సమావేశంలో గట్టు సతీష్, రౌతు గంగాధర్, నక్కల రవీందర్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువాత పడుతున్న సబ్సిడీ గొర్రెలు

● లబోదిబోమంటున్న లబ్ధిదారులు

● పట్టించుకోని అధికారులు

బీర్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం గొల్లకుర్మలకు ఇటీవల సబ్సిడీపై గొర్రెలను అందించింది. అయితే ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసిన గొర్రెలు లబ్ధిదారుల వద్ద బతకడం లేదు. సబ్సిడీ ద్వారా గొర్రెలు వచ్చా యన్న సంతోషం కలుగకుండానే చూస్తుండగానే గొర్రెలు ప్రాణాలు వదులుతున్నాయి. దీంతో లబ్ధిదా రులు లబోదిబోమంటున్నారు. బీర్‌పూర్ మండలంలోని 11 గ్రామాలకు సమారు 4,578 గొర్రెలను లబ్ధిదారులకు అందించగా అందులో ఇప్పటి వరకు రికార్డుల ప్రకారం 20 గొర్రెలు మృతి చెందినట్లు అధికారులు చెబు తున్నారు. అందులో తుంగూర్ గ్రామంలోనే 10గొర్రెలు చనిపోయాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా గొర్రెలు జబ్బుపడి ఉండటంతో ఆదివారం తుంగూర్ గ్రామానికి చెందిన నరిగే అశోక్ చెందిన గొర్రె మృతి చెందింది. ఈ విషయమై పశువైద్యాధికారి రమ్య మాట్లాడుతూ వాతావరణ మార్పుతోనే గొర్రెలు మృత్యువాత పడుతున్నాయన్నారు. మృతి చెందిన గొర్రెల జాబితాను తమ దృష్టికి తీసుకు వస్తే రూ. 4వేల నుంచి 5వేల వరకు ఇన్సూరెన్స్ వస్తుందని లబ్ధిదారులకు సూచించారు. మృతి చెందిన గొర్రెలకు సంబంధించిన లబ్ధిదారులను ప్రభుత్వం గుర్తించి మళ్లీ గొర్రెలను అందించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుడిసె జితేందర్ డిమాండ్ చేశారు.



మృతి చెందిన సబ్సిడీ గొర్రెను చూపిస్తున్న లబ్ధిదారు అశోక్

'క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయి'



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఐ శివకృష్ణ

రాయికల్: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎస్ఐ శివకృష్ణ అన్నారు. రాయికల్ భారత్ భవానీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం కబడ్డీ పోటీలను ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని అన్నారు. 14 జట్లు పాల్గొంటున్న ఈ పోటీల్లో విజేతలకు నిమజ్జనం రోజున బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తురగ రాజరెడ్డి, కట్కం రవి, యూత్ అధ్యక్షుడు ఇందూరి గంగాధర్, సభ్యులు ఎద్దండి దివాకర్, కుర్మ సుదర్శన్, బండెల శ్రీనివాస్, రమేష్, తాటిపాముల శ్యాం, మురళి తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో నాడీ వైద్య శిబిరం

మేడిపల్లి: మేడిపల్లి ప్రాథమిక పాఠశాలలో నాడీ (సుజోక్ అక్యుప్రెషర్) ఉచిత వైద్య శిబిరం జరిగింది. స్థానిక సర్పంచ్ బొంగోని రాజాగౌడ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 100 మందికి చికిత్సను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎడ్మల వనిత, గంగాధర్, వెంటేశ్వర్లు, వివమణి, లక్ష్మిరెడ్డి, ఉపాధ్యాయులు మహిపాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, ఎంపీటీసీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన కోరుకంటి గంగా భవాని బాసరలోని ట్రిపుల్ ఐటీలో ఇటీవల సీటు సాధించింది. గంగా భవాని నిరుపేద కావడంతో నేను సైతం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మర్రిపెల్లి కొండల్ రావు ఆమె విద్యాభ్యాసం కోసం రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్య క్రమంలో గుండేటి రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న కొండల్‌రావు

ఆపీ, రోటరీ క్లబ్ ఆధర్వంలో నేత్ర వైద్యశిబిరం

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పావని కంటి ఆసుపత్రిలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని వైద్యుడు సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జగిత్యాల, రాయికల్, సారంగాపూర్, మల్యాల, గొల్లపల్లి, మేడిపల్లి, బీర్‌పూర్ మండలాలకు చెందిన 26మందికి ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలు నిర్వహించారు. అనంతరం కంటి అద్దాలతో పాటు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీ.సూర్యం, కాశిరావు, కొత్త ప్రతాప్, బాలముకుందం, నక్కల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శస్త్ర చికిత్స నిర్వహించిన వారితో డా.సంజయ్ కుమార్

వినాయక మండపాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

కోరుట్లరూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మండపాల వద్ద గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఎకీన్‌పూర్ గ్రామంలో ప్రతిష్టాపించిన వినాయకునికి కోరుట్ల ఎంపీడీఓ గంగుల సంతోష్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎ మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చీటి వెంకటరావు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

● గణనాథునికి మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక పూజలు

కోరుట్ల: పట్టణంలోని రవీంద్ర రోడ్‌లో గల గణేశ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం కోరుట్ల మున్సిపల్ చైర్మన్ శీలం వేణుగోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకింది లావణ్య రాంప్రసాద్, యూత్ అధ్యక్షుడు దగ్గుల నర్సయ్య, నాయకులు పిల్లమారి శ్రీనివాస్, మిట్టపల్లి శేఖర్, జిందం జనార్ధన్, వాసాల ప్రవీణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లకు ఇంటర్వ్యూలు

కథలాపూర్: 29న ఎస్సీ కార్పొరేషన్ కింద మం జూరైన 32 యూనిట్లకు గానూ యువతీ, యువకులకు ఇంట ర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భూమేశ్వర్ ఆదివారం తెలిపారు. వివిధ రకాల యూనిట్లకు దరఖాస్తులు చేస్తున్న వారు మండల పరిషత్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

సిరికొండలో గణనాథుల నిమజ్జనోత్సవం

కథలాపూర్: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమ పంపిణీ చేసిన మట్టితో తయారు చేసిన గణనాథున్ని ఆదివారం సాయంత్రం నిమజ్జనం చేశారు. వాహనంపై ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజల అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముంజ నవీన్, శ్రీదర్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కూరగాయల గణనాథుడు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో శ్రీరాం యూత్ సభ్యులు ప్రతిష్టాపించిన కూరగాయల గణనాథుడు భక్తులను ఆకట్టుకుంటున్నాడు. 25 రకాల కూరగాయలతో గణపతిని అలకరించారు. భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

జై గణేశ్ భక్తి సమితి జిల్లా అధ్యక్షుడిగా శ్రీకాంత్


రేగుల శ్రీకాంత్

కోరుట్ల: తెలంగాణ రాష్ట్ర జై గణేశ్ భక్తి సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షునిగా కోరుట్ల పట్టణానికి చెందిన యువజన సంఘ నాయకుడు రేగుల శ్రీకాంత్‌ను నియామకం చేసినట్లు రాష్ట్ర అధ్య క్షుడు జైన్ కుమార్ చారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లు ఆదివారం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా వాసాల నవీన్‌ను నియామకం చేసినట్లు తెలిపారు. వీరి నియామకం పట్ల కౌన్సిలర్ ఇందూరి సత్యం, నాయకులు కొండ రవి యాదవ్, మోటూరి సంతోష్, చౌల అఖిల్, సంతోష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మర్రవ్వ ప్రవేశ ద్వారం పనులు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మర్రవ్వ ఆలయ ప్రవేశ ద్వారం పనులు ఆదివారం ప్రారంభించారు. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన గల్ఫ్ ప్రవాసి గడ్డం గంగారెడ్డి రూ. 3.50 లక్షలు విరాళం ఇవ్వగా ప్రవేశ ద్వారం నిర్మిస్తున్నారు. సర్పంచ్ గడ్డం లక్ష్మీ భూమారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భువనేశ్వరి శశిదర్‌లు గంగారెడ్డిని అభినందించారు.

కథలాపూర్ ఎంపీడీఓగా మచ్చ గీత

కథలాపూర్ మండల ఎంపీడీఓగా మచ్చ గీతను నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. రాయికల్ మండలంలో పనిచేసిన సెలవులో ఉన్న గీతను కథలాపూర్‌కు కేటాయించారు. ఈ మేరకు 30న బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

మేరు సంఘం కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల: కోరుట్ల పట్టణ మేరు సంఘం అధ్యక్షుడిగా మునిగాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గట్ల సతీశ్, కార్యదర్శిగా కొట్టూరి రమేశ్, సహాయ కార్యదర్శిగా రాంగిరి గణేశ్, కోశాధికారిగా గట్ల రమేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంగిరి గంగాదర్, గట్ల గణేశ్, కర్నె లక్ష్మణ్, గట్ల శ్రీఇనవాస్, రాంగిరి లక్ష్మణ్, సంగ గణేశ్ పాల్గొన్నారు.

‘హరిత తెలంగాణ’కు సహకరించాలి

● మున్సిపల్ చైర్మన్ శీలం వేణుగోపాల్


కోరుట్లలో మొక్కను నాటుతున్న మున్సిపల్ చైర్మన్ శీలం వేణుగోపాల్

కోరుట్ల: ముఖ్యమంత్రి కేసీఆర్ కలలుగంటున్న ‘హరిత తెలంగాణ’ ఏర్పాటుకు అన్ని వర్గాలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ శీలం వేణుగోపాల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐబీ గెస్ట్‌హౌజ్ ప్రాంతంలో టీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వ ర్యంలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ విధిగా ఒక్కో మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కల తోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించాలంటే మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ రఫియోద్దిన్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, నాయకులు అజీమోద్దిన్, ఎండీ మోసీన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమానికి మరిన్ని సేవలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

● కోరుట్ల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఉషాకిరణ్

కోరుట్ల: కోరుట్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేద ప్రజల సంక్షేమానికి మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని కోరుట్ల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎలిమెల్ల ఉషాకిరణ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సాయి జీనియస్ పాఠశాలలో రేకూర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు 285 మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. ఇందులో 48 మందికి మోతబిందు ఆపరేషన్ చేయడానికి ఎంపిక చేశారు. వీరిని కరీంనగర్ రేకూర్తి కంటి ఆసుపత్రికి తరలించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఉషాకిరణ్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జక్కని ధనుంజయ్, కోశాధికారి భూంరెడ్డి, లయన్స్‌క్లబ్ నాయకులు గంగ్రి దిలీప్‌రావు, అన్నం అనిల్, గుంటుక ప్రకాశ్, ఆడెపు మధు, చాప కిశోర్, పోల రఘునందన్, గుంటుక సురేశ్ బాబు, పోతని ప్రవీణ్, పిడుగు గుణాకర్‌రెడ్డి, గుంటుక మహేశ్, జీవన్‌రెడ్డి, రేకూర్తి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

తట్టు, రూబెల్లా వ్యాక్సిన్లను తప్పకుండా ఇప్పించాలి


మాట్లాడుతున్న డాక్టర్ మసూద్

కోరుట్ల: తొమ్మిది నెలల నుంచి పదిహేనేళ్లలోపు చిన్నారులకు తప్పకుండా తట్టు, రూబెల్లా వ్యాక్సిలను ఇప్పించాలని వైద్యులు మసూద్, ధనుంజయ్‌లు సూచించారు. ఆదివారం పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో విద్యార్థులకు తట్టు, రూబెల్లా వ్యాక్సిన్లపై అవగాహన కల్పించారు. వంద శాతం విద్యార్థులకు టీకాలను వేయించాలని, ఎలాంటి దుష్పరిమాణాలు ఉండవని పేర్కొన్నారు. ప్రాణాంత వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు ఎంఏ బారీ, ప్రధానోపాధ్యాయురాలు సెలీన్ వర్గీస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

కోరుట్ల: పర్యావరణ పరిరక్షణకు అన్ని వర్గాలు సహకరించాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని 28వ వార్డులో మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. ఖాళీ ప్రదేశాల్లో నీటిని నిలువ చేయరాదని సూచించారు. కూలర్లు, టైర్లలో ఎప్పటికప్పుడు నీటిని తొలగించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని పేర్కొ న్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ రాజయ్య, పుప్పాల ప్రభాకర్, కాలనీ ప్రజలు, మున్సిపల్ జవాన్ రమేశ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి కాలుష్యాన్ని అరికట్టాలని రైతుల ఆందోళన


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

● ఎకీన్‌పూర్‌లో రైతుల ఆందోళనను అడ్డుకుంటున్న తహసీల్దార్

కోరుట్లరూరల్: ఓ రైస్‌మిల్ నుంచి వెలువడే వ్యర్థాలతో సాగునీరు కాలుష్యమవుతోందని, సంబంధిత అధికారులు పరిశీలన జరిపి అరికట్టాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఎకీన్‌పూర్ గ్రామంలో ఆదివారం పలువురు రైతులు ఆందోళన చేశారు. గ్రామానికి వచ్చన జిల్లా కలెక్టర్ శరత్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో భాగంగా ఆయన వచ్చే సమయంలో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సత్యనారాయణ అక్కడకు చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామశివారులోని ఓ రైస్‌మిల్ ద్వారా సాగునీరు కాలుష్యమవుతోందని ఆరోపించారు. సంబంధిత వ్యర్థాలు మాటు కాలువ ద్వారా వస్తూ నీరు కాలుష్యం కావడంతో సాగుకు నీరు దొరకక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో సైతం సంబంధిత వ్యర్థాల ద్వారా భూసారం తగ్గిపోతుందని ఆరోపించారు. పలు సందర్భాల్లో అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కాగా తహసీల్దార్ సత్యనారాయణ రైతులతో మాట్లాడుతూ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి సహకరిస్తానని పేర్కొన్నారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎకీన్‌పూర్‌కు చెందిన పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.


మాటు కాలువను పరిశీలిస్తున్న తహసీల్దార్

'కాళేశ్వరం' పై ప్రజాభిప్రాయ సేకరణ డ్రామా

● దమ్ముంటే ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు రావాలి ● జడ్పీ సమావేశంలో మెడికల్ కళాశాలపై తీర్మానం చేయాలి
● టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్ : కాళేశ్వరం ప్రాజెక్టు శంకుస్థాపన చేసి 17 నెలలు గడిచిన తరువాత ప్రజాభిప్రాయ సేకరణ ఏ విధంగా చేస్తారని, ప్రజలను మభ్యపెట్టడానికి సీఎం కేసీఆర్ డ్రామా చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆయన ఆదివారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పర్యావరణ అనుమతులు లేకుండా భూసేకరణ, ప్రాజెక్టు పనులు ఏ విధంగా ప్రారంభించారని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేసి రెండేళ్లు గడుస్తున్నా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రెండేళ్లలో నీరందిస్తానని చెప్పిన కేసీఆర్ 2016 మే 1న శంఖుస్థాపన చేసి ఆగస్టు 24న మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నాడని, ఆగస్టు 26న మంత్రి హరీష్‌రావు అధికారులతో సమీక్ష జరిపి వచ్చే ఏడాది నీరిస్తామని చెప్పారని, ఇదంతా జరిగిన ఏడాదిన్నర తరువాత పర్యావరణ అనుమతులంటున్నారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమంటూ సీఎం, మంత్రి హరీష్‌రావులు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సారెస్పీ, ఎల్ఎండీ, వరదకాలువ, ఎల్లంపల్లి సాగునీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే నిర్మించారనే విషయాన్ని మరిచిపోకూడదన్నారు. వరద కాలువలో మిగిలిపోయిన కొద్దిపాటి పనులను చేస్తూ విస్తృత ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. మంత్రి హరీష్‌రావు అబద్దాల బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కాంగ్రెస్‌పార్టీపై అబద్దాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇరిగేషన్ శాఖకు కేటాయించిన నిధులు, చేసిన పనులు, టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడేళ్లలో చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2013 భూసేకరణ చట్టం అమలు చేయటంలేదని బాధిత రైతులు కోర్టుకు వెళితే కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. జీఎస్టీతో అన్యాయం జరుగుతుందని కోర్టుకు వెళతామని చెప్పిన కేసీఆర్ అదే విధంగా పరిహారం చెల్లింపులో తమకు అన్యాయం జరుగుతుందని కోర్టుకు వెళ్లిన రైతులను ఎలా తప్పుపడుతున్నారని అన్నారు. మేడిగడ్డ-తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు తగ్గించి తెలంగాణ ప్రజల పరువును మహారాష్ట్రకు తాకట్టు పెట్టిన టీఆర్ఎస్ ప్రభుత్వం సంబరాలు చేసుకుందని విమర్శించారు. కరీంనగర్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని కరీంనగర్ జెడ్పీ సమావేశంలో సభ్యులు తీర్మానం చేయాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ జడ్పీలో ఉన్న అన్ని రాజకీయ పక్షాల జడ్పీటీసీ, ఎంపీపీ, ఇతర సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమకు లేఖను పంపిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒక వేళ కరీంనగర్‌లో వైద్య కళాశాల అవసరంలేదనుకుంటే ఆ మేరకే తీర్మాణం చేయాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మేయర్ డి శంకర్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల ప్రకాశ్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు దిండిగాల మధు, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ల ప్రసాద్, యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిశేఖర్, ఎలగందుల మునీందర్, పొన్నం సత్యనారాయణ, పొన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఈఎన్‌సీ అనిల్ కుమార్

తిమ్మాపూర్: మధ్యమానేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతం ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టుల ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ కరీంనగర్(ఈఎన్‌సీ) అనిల్ కుమార్ తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికల ప్రకారం రాబోయే రోజుల్లో భారీ వర్షాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 2.2 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.33 టీఎంసీ నీటి నిల్వ ఉందన్నారు. ఇన్‌ఫ్లో ప్రస్తుతం 1058 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో ప్రస్తుతం ఏమీ లేదన్నారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాల కారణంగా నీటి ప్రవాహక ప్రాంతాల నుంచి భారీగా ఎగువ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో ఉన్నదన్నారు. దీని వల్ల ఎగువ మానేరు నిండిన వెంటనే మధ్య మానేరు రిజర్వాయరులోకి నీరు వచ్చే అవకాశముందన్నారు. కాబట్టి మిడ్ మానేరు కింది పరివాహాక ప్రాంతాల్లోని ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

30, 31 తేదీల్లో ఉమ్మడి జిల్లాస్థాయి ఏకలవ్య కబడ్డీ క్రీడలు

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ ఎరుకల యువజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో ఉమ్మడి జిల్లాస్థాయి ఏకలవ్య కబడ్డీ క్రీడలను నిర్వహించనున్నామని ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని శాతవాహన ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఆదివారం జిల్లాస్థాయి ఎరుకల విద్యార్థి సంఘం సమావేశం నిర్వహించారు. ఏకలవ్య కబడ్డీ క్రీడలను కేవలం ఎరుకల కులస్తుల కోసం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న కబడ్డీ జట్లు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆసక్తిగల వారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. పోటీల్లో ప్రథమ స్థానానికి 20 వేలు షీల్డు, ద్వితీయ స్థానానికి 10 వేలు షీల్డు, తృతీయ స్థానానికి 5 వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నామని తెలిపారు. సమావేశంలో విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు బిజిలి తిరుపతి, రాష్ట్రసహాయ కార్యదర్శులు ఉండాడి సాగర్, సమ్మలు, అంజనిప్రసాద్, మెగిలి సమ్మయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాజేందర్, అంజయ్య, కనకయ్య, పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు వరద నీరు

● ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ● ప్రాజెక్ట్‌లోకి 26 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
● 1 టీఎంసీ పెరిగిన నీటిమట్టం ● ఎస్సారెస్పీ నీటిమట్టం 27.738 టీఎంసీలు

ఆంధ్రజ్యోతి, జగిత్యాల : శ్రీరాంసాగర్‌కు మళ్లీ వరద నీరు వచ్చి చేరుతుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టులోకి ఆదివారం 26 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఒక్క రోజే ఒక టీఎంసీ నీటిమట్టం పెరిగింది. మహారాష్ట్ర ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటం వల్ల బాబ్లీలోప్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఆదివారం ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వచ్చింది. ఆదివారం ఉదయం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం 26.814 టీఎంసీ(1068.90 అడుగులు)లు ఉండగా, మధ్యాహ్నం 1 గంట వరకు 25,645 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. మూడు గంటల వరకు 26,375 క్యూసెక్కులకు పెరిగింది.

దీంతో ప్రాజెక్ట్‌లోకి ఈ ఒక్క రోజే ఒక్క టీఎంసీ నీరు వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు. శ్రీరాంసాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 90.31 టీఎంసీ(1091 అడుగులు)లు కాగా, ఆదివారం సాయంత్రం నాటికి 27.738 టీఎంసీ(1069.40 అడుగులు)లకు చేరుకుంది. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్ట్ నీటిమట్టం 37.379 టీఎంసీ(1074 అడుగులు)లుగా ఉంది.


శ్రీరాంసాగర్‌లో పెరిగిన నీటిమట్టం

అవినీతి అధికారితో రాజీపడలేకే శ్రీకాంత్ ఆత్మహత్య

● మరణవాంగ్మూలం కూడా పట్టించుకోరా? ● సీఎల్పీ ఉప నేత జీవన్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

వెల్గటూర్: అవినీతి అధికారితో రాజీ పడలేకే దేవీ శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడని సీఎల్పీ ఉపనేత, జగిత్యాల ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పంచాయితీ యువ ఇంజనీర్ దేవి శ్రీకాంత్ మృతికి కారణమైన వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఎండపెల్లిలో శ్రీకాంత్ కుటుంబీకులను జీవన్‌రెడ్డితో పాటు జడ్పీ మాజీ చైర్మన్ అద్దూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి పెరుగుతోందన్నారు. శ్రీకాంత్ మృతి ప్రభుత్వ అవినీతికి, ఉన్నతాధికారుల నియంతృత్వ ధోరణికి అద్దం పడుతోందన్నారు. నిర్మల్ డివిజన్ పంచాయితీరాజ్ ఈఈ రఘు వీరారెడ్డి వేధింపులకు తలొగ్గలేకనే యువ ఇంజనీర్ శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఈఈ రఘువీరారెడ్డి వేధింపులు భరించలేకనే ఆత్మహత్య చేసుకుంటున్నాని మరణ వాంగ్మూలం (సూసైడ్‌నోట్) రాసినా పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు అధికారిపై ఇప్పటి వరకు చర్యలు చేపట్టక పోవడం ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనం అని ఎద్దేవా చేశారు. ఈ ఈఈ రఘువీరారెడ్డి పరారీలో ఉన్నాడని అతనిని పట్టుకోడానికి రెండు స్పెషల్ పార్టీలు ఏర్పాటు చేశామని ఎస్పీ అనడం విడ్డూరంగా ఉందన్నారు. పంచాయితీ రాజ్ శాఖ మంత్రి, ఇంజనీర్ ఇన్ చీఫ్ దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం శ్రీకాంత్ కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు అతడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బండ శంకర్, మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ చుక్క శంకర్‌రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేష్, నాయకులు జితేందర్ రెడ్డి, శ్రీను, సంజీవ్‌రెడ్డి, సతీష్, మురళి పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్పత్రులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్నేహితుల్లే వస్తు లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్‌లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

'వైద్య కళాశాల కోసం తీర్మానాలు చేసి పంపించాలి'

జగిత్యాల టౌన్: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో, అన్ని కుల సంఘాల్లో తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపాలని పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం కిషన్‌రెడ్డి, టీబీసీ ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు హరిఅశోక్‌కుమార్‌లు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోల సంఘ భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్ అవసరాలు దృష్టిలో ఉంచుకొని జగిత్యాలలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని సీఎం చంద్రశేఖర్‌రావును కోరుతూ తీర్మానాలు చేసి వాటి ప్రతులను ప్రభుత్వానికి పంపించాలని వారు కోరారు.

ఏర్పాటు చేయని సూచిక బోర్డులు..

● ఇబ్బందులు పడుతున్న దూరప్రాంత ప్రయాణికులు


సూచికలు లేని మంగేళ క్రాస్ రోడ్డు


సూచికలు లేని చిత్రవేణిగూడెం క్రాస్‌రోడ్డు

బీర్‌పూర్: తెలియని గ్రామాలకు వెళ్లాలంటే ఎవరైనా తెలిసిన వారు తోడైనా ఉండాలి లేదా గ్రామాలకు మార్గాలు చూపించే దిక్సూచి బోర్డులైన ఉండాలి. బీర్‌పూర్ మండలంలో చిన్నచిన్న పల్లెలతో కలిపి సుమారుగా 15 గ్రామాల వరకు ఉంటాయి. ఆ గ్రామాలకు వెళ్లాలంటే ఎన్నో ఎక్స్ రోడ్లు, క్రాస్‌రోడ్ల గుండా వెళ్లాలి. కొన్ని సంవత్సరాల నుంచి అదిలాబాద్ నుంచి కమ్మునూర్ బ్రిడ్జి మీదుగా జగిత్యాల, ధర్మపురి ప్రాంతాలకు వాహనాల రద్దీ అధికమయింది. దూర ప్రాంతం నుంచి వచ్చే వారు ఎక్స్‌రోడ్లు, క్రాస్‌రోడ్ల వద్ద ఏ రోడ్డు ఎటు వైపు వెళుతుందో తెలియని పరిస్థితిలో పదుల కిలోమీటర్లు గమ్యం లేని ప్రయాణాలు చేసి ఇబంది పడుతున్నారు. మండలంలో తెలంగాణతల్లి చౌరస్తా, శాంతిస్థూపం చౌరస్తా, ఇందిరానగర్ ఎక్స్‌రోడ్, రేకులపల్లి క్రాస్‌రోడ్, చిత్రవేణిగూడెం క్రాస్‌రోడ్, మంగేళ క్రాస్‌రోడ్, కండ్లపెల్లి క్రాస్‌రోడ్‌లు దిక్సూచి బోర్డులు లేకుండా అడుగడుగునా దర్శనమిస్తాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా అధికారులు స్పందించి ఎక్స్ రోడ్ల వద్ద దిక్సూచి బోర్డులు ఏర్పాటు చేసి దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు సురక్షితంగా గమ్యాలకు చేరేలా కృషి చేయాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి..

చెరుపూరి సుభాష్, నర్సింహులపల్లి



ప్రతి ఎక్స్‌రోడ్, క్రాస్‌రోడ్‌ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి దూర ప్రాంత ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు రూటు తెలియక మధ్యలో ఇబ్బందిపడటం తరచుగా జరుగుతోంది.

వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు..

మసర్తి రమేష్, బీర్‌పూర్



ప్రతి క్రాస్ రోడ్డు వద్ద రూట్ బోర్డులు ఏర్పాటు చేయాలి. రూట్ తెలియక మరో దారిన వెళ్లడం ద్వారా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

రేపు క్రీడా పోటీలు

జగిత్యాల అర్బన్: ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాలలో క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్యాంప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మినిస్టేడియంలో జగిత్యాల పట్టణానికి చెందిన అండర్-17 బాలబాలికలకు బాస్కెట్ బాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రంతో ఈ నెల 29న ఉదయం 9 గంటలకు మినిస్టేడియంలో రిపోర్ట్ చేయాలని కోరారు. అయితే కబడ్డీలో పాల్గొనే బాలురు 57 కిలోలు, బాలికలు 54 కిలోల లోపు బరువు ఉన్నవారే అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులను కూడా అందజేయనున్నట్లు వివరించారు.

సాముహిక సెలవుకు తపస్ మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న తపస్ నాయకులు

జగిత్యాల అర్బన్: సీపీఎస్ విధానాన్ని రద్దుపరచాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న తలపెట్టిన ఉపాధ్యాయ, ఉద్యోగుల సామూహిక సెలవు ఉద్యమానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జగిత్యాల శాఖ మద్ధతు తెలిపింది. జిల్లా కేంద్రంలోని స్థానిక గీతా గ్రంథాలయం ఆవరణలో తపస్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సామూహిక సెలవు పోస్టర్‌ను అవిష్కరించారు. అనంతరం తపస్ నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ పట్ల ఉద్యోగులు తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేయాలంటే సామూహిక సెలువు పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అయిల్నేని నరేందర్ రావు, వొడ్నాల రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భోనగిరి దేవయ్య, జిల్లా అర్గనైజింగ్ కార్యదర్శులు గడ్డం మహిపాల్‌రెడ్డి, గుర్రాల ప్రేమ్ కుమార్, నాయకులు శ్రీనివాసరావు, సంది శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ రావు, కస్తూరి శ్రీధర్, బంగ్లా శ్రీనివాస్, రామకృష్ణ, నాగరాజు, పూర్ణచందర్, శ్రీనివాస్, అశోక్ రావు, మదన్‌మోహన్ రావు, ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కెజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

జగిత్యాల అర్బన్: కెజీబీవీ పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నునావత్ రాజు, వుజగిరి జమునరాణిలు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా సెలవులు, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేసవి సెలవుల్లో వేతనాలను చెల్లించాలని, మహిళా ఉపాధ్యాయుల వలే అకస్మిక సెలవులు, ప్రత్యేక సెలవులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

9న టీపీటీఎఫ్ ఆత్మగౌరవ సభ

జగిత్యాల అర్బన్: సెప్టెంబర్ 9న జిల్లా స్థాయి ప్రైవేట్ ఉపాధ్యాయుల ఆత్మగౌరవ సభను నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీవాణి జూనియర్ కళాశాలలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలపై నిర్వహించబోయే ఆత్మగౌరవ సభకు ప్రైవేట్ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి అన్ని మండలాల్లో పని చేస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయులు తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్ రావు, ప్రవీణ్‌చంద్ర, గంగాధర్, సునీల్, కృపాకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఒగ్గు కళాకారుల ఉపాధ్యక్షుడిగా కొమురయ్య

జగిత్యాల రూరల్: తెలంగాణ రాష్ట్ర ఒగ్గు బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం నూతన కమిటీ కార్యవర్గాన్ని ఇటీవల ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ధర్మయ్య, ఉపాధ్యక్షుడిగా శెట్టి కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా చుక్క రవి, కోశాధికారిగా బుగ్గయ్య, డైరెక్టర్లుగా అంజయ్య, ఆదిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

సినిమా గైడ్

జగిత్యాల

బాలాజీ - ఫిదా
దుర్గరాజ కళా మందిర్ - వీఐపీ-2
నటరాజ్ - జయ జానకి నాయక
శ్రీ శ్రీనివాస - అర్జున్ రెడ్డి
శ్రీరామ- నేనే రాజు.. నేనే మంత్రి

రాయికల్

రాజశ్రీ - పటేల్ సర్..
మహేశ్వరి - శమంతకమణి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలి

● జగిత్యాల ఎమ్మెల్యే జీవన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు ఇప్పటి నుంచే బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే టి.జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో జగిత్యాల పట్టణ బూత్ స్థాయి కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో అధికారంతో పాటు కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేసేలా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా ఇచ్చిన హామీలు మాత్రం నేటికీ నెరవేరలేదని, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వం తీరుపై ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చైర్ పర్సన్ విజయలక్ష్మిదేవేందర్ రెడ్డి, ఉమ్మడి కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బండ శంకర్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, వైస్ చైర్మన్ సిరాజొద్దీన్ మన్సూర్, బూత్ లెవల్ స్థాయి నాయకులు గాజుల రాజేందర్, మసర్తి రమేష్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'హామీలను నెరవేర్చడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం'


సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

మేడిపల్లి: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలుపరచడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి అన్నారు. మేడిపల్లిలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే బతుకులు బాగుపడతాయని నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు నమ్మి ఉద్యమాలు చేసి రాష్ట్రాన్ని సాధించి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేశారని అన్నారు. అధికారంలో వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటగా ప్రారంభించిన చందుర్తి, మొత్కురావుపేట రోడ్డు టెండర్ ప్రక్రియ పూర్తయి ఐదు నెలలు కావస్తున్నా పనులు మొదలు పెట్టలేదన్నారు. మండలానికి సాగునీరందించే కలికోట పోతారం చెరువులో భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించలేదని అన్నారు. రైతులకు రుణమాఫీ అమలుకాక, రుణాలు అందక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రుణమాఫీ వెంటనే అమలు చేసి రైతులను అదుకోవాలన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూం పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎల్లంపెల్లి ఎత్తిపోతలతో ఒడ్యాడ్ ప్రాజెక్టు, గోవిందారం చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు భూమారెడ్డి, శేఖర్‌రెడ్డి, లచ్చానాయక్, రమేష్‌రెడ్డి, శంకర్, లక్ష్మిణ్, హన్మంతరెడ్డి, దేవయ్య, ప్రశాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు


ఆవుదూడలు

సారంగాపూర్: మండలంలోని బట్టపెల్లి గ్రామానికి చెందిన నైనాల రాఘువేందర్ అనే రైతుకు చెందిన ఆవు ఆదివారం రెండు దూడలకు జన్మనిచ్చింది. ఈ ఆవు ఇప్పటికే 19 ఈతలు ఇవ్వగా 20వ ఈతలో రెండు దూడలకు జన్మనివ్వగా అందులో రెండు ఆడ దూడలు కావడంతో రైతు సంతోషం వ్యక్తం చేశాడు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

జగిత్యాల అర్బన్: జగిత్యాల డిపో పరిధిలో ఆర్టీసీ సేవల సమస్యలపై సోమవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ హన్మంతరావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు సమస్యలను 9959225925 నెంబర్‌కు ఫోన్ చేసి డీఎంకు విన్నవించవచ్చునని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టంగ్ ట్విస్టర్స్

1. Clean clams crammed in clean cans.
2. There those thousand thinkers were thining how did the other three thieves go through.
3.Singing Sammy sung songs on sinking sand.
4. Picky people pick Peter Pan PeanutButter, 'tis the peanut-butter picky people pick.

సూక్తి

అసత్యంతో సాధించే విజయం కంటే.. సత్యంతో సాధించే పరాజయమే మేలు.


ఔనా!



డాల్ఫిన్లు ప్రతి అరగంటకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వచ్చి ఊపిరి పీల్చుకుంటాయి.

అద్దాల మయసభ

అదో అద్దాల దారి. అందులో అడుగుపెట్టామో.. ఎటు వైపు చూసినా ప్రతిబింబాలే కనిపిస్తాయి. ఏ దిక్కుకు వెళ్లాలో అర్థం కాదు. కాలు తీసి కాలు వేద్దామంటే.. అంతా అయోమయం. అద్దాల తళుకులు, మిరుమిట్లుగొలిపే కాంతులు కనులను మాయ చేస్తాయి. మరి అద్దాల దారుల్లో అసలు దారేదో కనుక్కోవడమే దీని ప్రత్యేకత. ఇదో 'దారి కనుక్కోండి' పజిల్ అన్న మాట. సింగపూర్‌లోని 'విజ్ఞాన కేంద్రం'(సైన్స్ సెంటర్)లో ఆకట్టుకుంటున్న ఈ 'మిర్రర్ మేజ్' ఓ ఆధునిక మయసభ అన్నమాట!



'దారి కనుక్కోండి' పజిల్ అంటే చాలామందికి ఎంతో ఇష్టం. చాలా దేశాల్లో రకరకాల 'మేజ్ పజిళ్లు' పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు తోటల్లోనూ తికమక పెట్టే దారులు ఏర్పాటు చేస్తుంటారు. అలానే సింగపూర్‌లో 'సైన్స్ సెంటర్' ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇటీవలే అందులో ఓ 'మిర్రర్ మేజ్'ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద అద్దాలు ఫ్రేములతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులోకి అడుగుపెడితే చాలు.. పైనా, కిందా, ఎటు వైపు చూసినా అద్దాల అందాలే. ఒకటికి పది ప్రతిబింబాలు కనిపిస్తుంటే.. అంతా అయోమయంగా తోస్తుంది. ఎటువైపు వెళ్లాలో తెలియదు. దారి ఉంది కదా అని అటు వైపు వెళ్లామో.. అంతే అది 'డెడ్ ఎండ్'ను సూచిస్తుంది. ప్రతి మలుపులో భ్రమింపచేసే ఎన్నో మాయలు. అసలు దారి ఎటు ఉందో తెలుసుకుంటే ఈ పజిల్ పూర్తి చేసినట్టే. ఈ అద్దాల గందరగోళానికి తోడు, మిరుమిట్లు గొలిపే లైట్ల కాంతులు కళ్లను తప్పుదోవ పట్టిస్తాయి. మొత్తంగా 270 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ అద్దాల మేజ్ సందర్శకులన ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ మేజ్ సెప్టెంబర్ వరకు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంటుంది. మయసభను తలపిస్తున్న ఈ మాయ అద్దాల దారిలో నడుస్తూ, తెగ సంతోష పడుతు ఆ జ్ఞాపకాల్ని తమ సెల్‌ఫోనుల్లో బంధించుకుంటున్నారు. ఎవరైనా ఉచితంగానే మిర్రర్ మేజ్‌ను సందర్శించవచ్చు.



- **ఆసియాలోని అతి పెద్ద 'మిర్రర్ మేజ్'గా ఇది రికార్డు సృష్టించింది.**
- **కాంతి భౌతిక ధర్మంతో పాటు, రంగులు కలిగించే భ్రమను సందర్శకులకు తెలియజేయడమే ఈ మిర్రర్ మేజ్ లక్ష్యమని నిర్వాహకులు అంటున్నారు.**
- **బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మేజ్ డిజైనర్ 'అడ్రియన్ ఫిషర్' ఈ మేజ్‌ను రూపొందించాడు.**

నవ్వుల్ నవ్వుల్

లంబూ : ఏరా! మేధావీ కొత్త కారు కొన్నావట? ఏ కంపెనీది?

మిస్టర్ మేధావి : కంపెనీ పేరు గుర్తుకు రావడం లేదు కానీ 'టీ'తో స్టార్ట్ అవుతుంది.

లంబూ : అవునా! నాది పెట్రోల్ పోస్తే గానీ స్టార్ట్ కాదు.

చెప్పగలరా?


వనంలో ఉన్నా కానీ మనంలో లేను
దివిలో ఉన్నా కానీ భువిలో లేను
నత్తిలో ఉన్నా కానీ సుత్తిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?




పడుకున్నప్పటికంటే టీవీ చూస్తుంటేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి.

బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



జవాబులు

చెప్పగలరా? : వదిన
జంతర్‌మంతర్ :
1. మెలకువ
2. వినియోగం
3. సుప్రభాతం
4. పంచాయతి

జంతర్‌మంతర్

1. మెకువల ▸ ....
2. వియోనిగం ▸ ....
3. భాతంసుప్ర ▸ ....
4. చాపంయతి ▸ ....

చుక్కలు కలపండి



ఆటల్లో ఆణిముత్యాలు

● రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థినుల ప్రతిభ

● కిక్‌బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణింపు

● ప్రోత్సాహమందిస్తే మరిన్ని పతకాలు



సాయిదుర్గను అభినందిస్తున్న ఎంపీ. కవిత



బంగారు పతకంతో బీర్‌పూర్ సుప్రియ

సారంగాపూర్: ఇద్దరు ఇద్దరే.. బరిలో దిగితే పతకం ఖాయం. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామానికి చెందిన మడ్డి సాయిదుర్గ, బీర్‌పూర్ సుప్రియ పాఠశాల స్థాయి నుంచి క్రీడలపై ఆసక్తి. ప్రస్తుతం డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు వెయింట్ లిఫ్టింగ్, కిక్ బాక్సింగ్ విభాగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ పతకాల పంట పండిస్తున్నారు. కోచింగ్ లేకుండా సొంతగా ప్రాక్టీస్ చేస్తూభేష్ అనిపించుకుంటున్నారు. కోచింగ్ ఇప్పిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తామని పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..

గ్రామానికి చెందిన మడ్డిపద్మ, రాజేశం దంపతుల కుమార్తె సాయిదుర్గ. ఐదేళ్ల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి పద్మ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. పాఠశాల స్థాయిలో సాయిదుర్గ ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు జిల్లా స్థాయి పోటీలకు వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఎంపిక చేశారు. ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతో అనేక పతకాలు సాధించింది. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ విభాగంలో బంగారు పతకం సొంతం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లో జరిగిన పోటీల్లోనూ స్వర్ణం గెలుచుకుంది. కర్నాటక, హైదరాబాద్, విజయవాడ, కేరళ, మహారాష్ట్రలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఐదు బంగారు, ఒక సిల్వర్ పతకం కైవసం చేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన మరో విద్యార్థిని బీర్‌పూర్ సుప్రియ. తల్లి దండ్రులు విజయ, రాజిరెడ్డి వ్యవసాయం చేస్తారు. సుప్రియ చిన్ననాటి నుంచి ఆటల్లో రాణిస్తుండడం, పాఠశాల స్థాయి పోటీల్లో చురుకుగా పాల్గొనడం గమనించిన ఉపాధ్యాయులు, తండ్రి రాజిరెడ్డి ప్రోత్సాహం అందించారు. దీంతో వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో పసడి పతకాల పంట పండిస్తోంది. మధ్యప్రదేశ్, పంజాబ్, రంగారెడ్డి, విజయవాడ, కేరళ, మహారాష్ట్ర, కర్నాటకల్లో నిర్వహించిన జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఆరు బంగారు, ఒక సిల్వర్ పతకం కైవసం చేసుకుంది. నిజామాబాద్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, విజయ వాడల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఏడు బంగారు, ఒక సిల్వర్ పతకం సొంతం చేసుకుంది.



పతకాలతో సాయిదుర్గ

నిమజ్జనానికి నీరేది...

● మానకొండూర్ చెరువులో నీటిని నింపడానికి ప్రయత్నించని అధికారులు

● ఆందోళనలో భక్తులు

మానకొండూర్: ఈ యేడు మానకొండూర్ మండలంలో ఆశిం చిన మేరకు వర్షాలు పడలేదు. దీంతో ఆయా గ్రామాల లోని చెరువులు, కుంటలలో నీరు లేకుండా పోయింది. మానకొండూర్ చెరువులో 22 ఏళ్లుగా కరీంనగర్‌కు చెందిన వందలాది గణేష్ విగ్రహాలతో పాటు మండలంలోని మానకొండూర్, సదాశివపల్లి, ముంజంపల్లి, శ్రీనివాస్‌నగర్, తిమ్మాపూర్ మం డలంలోని అల్గునూర్ గ్రామాలకు చెందిన గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తుంది. 22 ఏళ్లుగా మూడు క్రేన్ల సహాయంతో విగ్రహాలను నిమజ్జనం చేయడంతో ఆ ప్రదేశం పూడికతో నిండిపోయింది. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలతో నీరు ఎరుపు రంగుగా మారి పంటల దిగుబడి ఆశించిన స్థాయిలో రాక పోవడమే కాకుండా చేపలు మృత్యువాత పడుతు న్నాయి. స్నానాలకు వెల్లిన యువకులకు దురదలేచి కం తులు ఏర్పడుతున్నాయిని పలుమార్లు అధికారుల దృష్టి కి తీసుకెల్లిన అధికారులు పట్టించుకున్న పాపాన పోలే దు. గత సంవత్సరం మిషన్ కాకతీయ పథకానికి మానకొండూర్ చెరువు ఎంపికైంది. సంబంధిత కాంట్రాక్టర్ చెరువు చుట్టు ప్రక్కల పూడికతీత చేపట్టి విగ్రహాలు పడే స్థలంలో పూడికతీత చేపట్టక పోవడంతో పరిస్థితి ఎప్పటి లాగే ఉంది. చెరువు కట్ట మరమ్మతుల్లో బాగంగా కట్టను వెడెల్పు చేసి ఎత్తుగా నిర్మించారు. దీంతో చెరువులో ఉన్న నీటిలో క్రేన్‌ల సహాయంతో చేస్తే ఏ ఒక్క విగ్రహం మునిగిపోయే అవకాశం ఉండదని ఒకే ప్రదేశంలో గుట్టలు గుట్టలుగా ఏర్పడి నిమజ్జనానికి ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని అధికారులు భయపడుతున్నారు. ఈ నెల 25న ప్రతిష్టించిన విగ్రహాలు నవరాత్రోత్సవాలు జరుపుకొని సెప్టెంబర్ 2న నిమజ్జనాకి వెళతాయి. అందులో బాగంగా చెరువులో నిమజ్జనానికి సరపడా నీరు లేకపోవడంతో గ్రామ పంచాయితీ పాలకవర్గం ఎల్‌ఎండీ నుంచి కాకతీయ కాల్వ ద్వారా మానకొండూర్ చెరువులోకి నీటిని సరఫరా చేయాలని వారం రోజు ల క్రితం కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు వినతి పత్రం సమర్పించారు. అయినా అధికారలు ఎలా ంటి ప్రయత్నాలు చేపట్టక పోవడంతోగ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాకతీయ కెనాల్ ద్వారా చెరువులోకి నీటి ని సరఫరా చేయాలని భక్తులు కోరుతున్నారు.



నీరు లేక వెలవెల పోతున్న మానకొండూర్ చెరువు

అధ్వానంగా రహదారులు..

● చిరు జల్లులకే చిత్తడిగా మారిన పల్లె రోడ్లు ● పట్టించుకోని అధికారులు, పాలకులు



కాసారం, గర్శకుర్తి గ్రామాల మధ్య అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

గంగాధర : ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాల్సిన పాలకులు, అధికార యంత్రాంగ పట్టింపు లేని దోరణి వల్ల గంగాధర మండలంలోని పలు గ్రామాల రోడ్లు చిరు వర్షపు జల్లులకే అధ్వానంగా మారి ప్రజలు అవస్థలు పడుతున్నారు.ఇటీవల కురిసిన చిరు వర్షాలకు గుంతలు పడిన మట్టి రోడ్లపై నీరు నిలిచి చిత్తడిగా మారాయి. మండలంలోని హిమ్మత్ నగర్ గ్రామం నుంచి వెదిర వరకు గల మూడు కిలో మీటర్ల రోడ్డు అడుగడుగున గుంతలు పడి వర్షాలకు గుంతల్లో నీరు నిలిచాయి. ఈ రూట్లో వెళ్లే హిమ్మత్‌నగర్, గట్టుభూత్కూర్ గ్రామాల ప్రజలువాహనాలు, నడిచి వెళ్లలేక అనేక అవస్థలు పడుతున్నారు. తాడిజెర్రి నుంచి హిమ్మత్ నగర్ వచ్చే రోడ్డు మరి అధ్వానంగా మారింది. కాసారం, తడగొండ వెళ్లాల్సిన గర్శకుర్తి గ్రామం మీదుగా వెళ్లే రహదారి కూడా అనేక చోట్ల గుంతలు పడి నీరు నిలిచి పాదచారులు నడిచి వెళ్లలేని విధంగా తయారు అయ్యింది. గర్శకుర్తి తడగొండకు నాలుగు కిలో మీటర్లు, కాసారం నుంచి గర్శకుర్తికి మూడు కిలో మీటర్ల పొడవున రోడ్డు చిత్తడిగా మారి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. తిర్మలపూర్ నుంచి కోట్ల నర్సింహులపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రానైట్ లారీలు ఓవర్ లోడ్‌తో నడ వడం వల్ల మట్టి రోడ్లతోపాటు గంగాధర చౌరస్తాలోని తారు రోడ్డు ప్రజలు నడువలేని విధంగా మారాయి.అధికార యంత్రాం గం ఈ రహదారిపై నుంచే వచ్చి వెళ్తున్నా పట్టించుకున్న వారే కరవు అయ్యారు. సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు పట్టించుకుని రోడ్లకు కనీస మరమ్మతులు చేట్టాలని ప్రజలు కోరుతున్నారు.



హిమ్మత్‌నగర్, వెదిర మధ్య బురదమయంగా మారిన రహదారి



ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు

● సిరిమల్ల చంద్రమోహన్, సర్పంచ్, హిమ్మత్‌నగర్

హిమ్మత్‌నగర్ నుంచి వెదిర, తాడిజెర్రి నుంచి హిమ్మత్‌నగర్ వచ్చే రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. జీపీలో నిధులు లేక కనీసం మొరం పోసే వీలులేకుండా ఉంది.

రేపు జానపద జాతర

● జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్

ఆంధ్రజ్యోతి, జగిత్యాల: ఈ నెల 29 మంగళవారం స్థానిక దేవిశ్రీ గార్డెన్‌లో జానపద జాతర-2017ను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ ఒక ప్రకటనలో తెలిపారు. జన జీవనంలో, జాతి సాంస్కృతిక వారసత్వంలో అత్యంత కీలకమైన అభివ్యక్త రూపాలు జానపద కళా రూపాలని కలెక్టర్ అన్నారు. అంతర్జాతీయంగా వివిధ దేశాలు, ప్రభుత్వాలు ఆగస్టు 22వ తేదీని ప్రపంచ జానపద దినోత్సవంగా నిర్వహిస్తున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రంలో జానపద ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా జగిత్యాల జిల్లాలో ఈ నెల 29న నిర్వహించనున్నట్లు కలెక్టర్ అన్నారు. స్థానిక దేవిశ్రీ గార్డెన్‌లో నిర్వహించే ఈ ఉత్సవాలు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అన్ని కళా రూపాలకు సంబంధించిన 8 కళా బృందాలచే ప్రదర్శనలు ఉంటాయని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

3, 5వ తేదీల్లో గణపతి నిమజ్జనం



బ్రాహ్మణవాడ వినాయకుని వద్ద నిర్వహిస్తున్న సమావేశం

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 3, 5వ తేదీల్లో గణపతి నిమజ్జనం కార్యక్రమాన్ని జరుపుకోవాలని అఖిల బ్రాహ్మణ సంఘం, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ఆదివారం నిర్ణయించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలోని గణేష్ మండపం వద్ద జగిత్యాల బ్రాహ్మణ సేవా సంఘం, గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రముఖ వేదపండితులు శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక హాజరై గణేష్ నిమజ్జనంనపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సాధారణ నిమజ్జనం సెప్టెంబర్ 3న జరుగనుండగా అనంత చతుర్దశి 5న మంగళవారం ఉన్నందున అదే రోజున స్వామివారి నిమజ్జనం నిర్వహించాలన్నారు. వినాయక వ్రతం సందర్భంగా నవరాత్రోత్సవాలు వైభవంగా జరుపుకుంటున్నందున ఏ కార్యక్రమమైన ఉదయాత్పూర్య తిథి ప్రధానమని 5వ తేది మంగళవారం రోజునే నిమజ్జనం చేయవచ్చునని స్పష్టం చేశారు.

